కొవ్వొత్తులతో ప్రదర్శన

- ఆట, పాటల ద్వారా నిరసన
- 13వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 142 | విజయవాడ, సోమవారం 25 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 25 December 2023 | Rs

ప్రజాశక్తి

పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు

క్రిస్మస్ శుభాకాంక్షలు

- ఎడిటర్

ఏలూరులోని హేలాపురి బాలోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

అంబరాన్నంటిన పిల్లల సంబరాలు

- ముగిసిన హేలాపురి, పల్నాడు బాలోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా/ ఏలూరు అర్బన్

బాలల్లో ఆటపాటలు యాంత్రికంగా తయారైన నేపథ్యంలో వారిలో సహజత్వాన్ని పెంచాలని, సృజనాత్మకతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బాలోత్సవాలు జరిగాయి. ఏలూరు అమీనాపేటలోని సురేంద్ర బహుగుణ స్కూల్లో షేక్ సాబ్జీ స్మారక ప్రాంగణంలో జరుగుతున్న హేలాపురి బాలోత్సవం-4 రెండో రోజు ఆదివారం ఉత్తేజభరితంగా సాగింది. పిల్లల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ.. బాలోత్సవంలో అభ్యుదయ సాహిత్యం ప్రాతిపదికన జానపద, ప్రాచీన కళల ఆధారంగా నృత్యాలతో పిల్లల సంబరాలు నిర్వహించడం మిగతా 2లో

పల్నాడు బాలోత్సవంలో దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థులు

రెజ్లర్ల పోరుతో దిగొచ్చిన కేంద్రం

నూతన ప్యానెల్ రద్దు చేస్తున్నట్లు ప్రకటన

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) నూతన కార్యవర్గాన్ని రద్దు చేయాలని రెజ్లర్లు తాజాగా చేపట్టిన పోరాటానికి కేంద్రం దిగరాక తప్పలేదు. డబ్ల్యూఎఫ్ఐ నూతన ప్యానెల్‌ను రద్దు చేస్తున్నట్లు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన ప్యానల్ తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటుందని క్రీడా మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. డబ్ల్యూఎఫ్ఐ నియమాలను, నిబంధనలను నూతన ప్యానెల్ పూర్తిగా విస్మరించిందని విమర్శించింది. అలాగే డబ్ల్యూఎఫ్ఐ వ్యవహారాలను నియంత్రించడానికి, నిర్వహించడానికి ఒక తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేయాలని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఒఎ)ను క్రీడా మంత్రిత్వ శాఖ కోరింది. ఈ మేరకు ఐఒఎకు లేఖ రాసింది. డబ్ల్యూఎఫ్ఐను రద్దు చేయలేదని స్పష్టం చేసింది.

కోర్టు కేసులతో సుదీర్ఘంగా వాయిదా పడుతూ వచ్చిన భారత రెజ్లింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు డిసెంబర్ 21న ముగిశాయి. మాజీ అధ్యక్షుడు, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ ఇటీవల ఎన్నికల్లో కొత్త ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. సంజయ్ సింగ్ 40 ఓట్లు దక్కించుకోగా.. మాజీ రెజ్లర్ అనిత షియోరాన్‌కు ఏడు ఓట్లు పోలయ్యాయి. బ్రిజ్‌భూషణ్ సన్నిహితుడు, వ్యాపార భాగస్వామి, కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ వాది సంజయ్ సింగ్ అధ్యక్ష కుర్చీలో కూర్చోవటంతో.. రెజ్లింగ్ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. అండర్-15, అండర్-20 జాతీయ ట్రయల్స్ గోండాలోని నందినగర్‌లో నిర్వహిస్తున్నట్టు ఇటీవల బ్రిజ్‌భూషణ్ ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఈ ట్రయల్స్‌ను ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే నిర్వహించాలి. 'భారత రెజ్లింగ్ సమాఖ్య రూల్స్ 3(ఈ) ప్రకారం.. ఏదేని సీనియర్, జూనియర్ లేదా సబ్ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్స్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ రూల్స్‌ను అనుసరించి.. ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే నిర్వహించాలి. ఇటువంటి నిర్ణయాలను ముందస్తుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఎజెండాలో ఉంచి, ఆపై నిర్ణయాలు తీసుకోవాలి. నూతనంగా ఎన్నికైన ఎగ్జిక్యూటివ్ కమిటీ పూర్తిగా గత పర్యాయం ఆఫీస్ బేరర్ల ఆధీనంలో పని చేస్తుందని అనిపిస్తుంది. ఇది జాతీయ స్పోర్ట్స్ కోడ్‌కు అవమానం. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు, మిగతా 2లో

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా ఇటీవల గెలుపొందిన బ్రిజ్‌భూషణ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ (ఫైల్)

రద్దును స్వాగతిస్తున్నాం : సాక్షి మాలిక్

ఏదైనా మంచి జరగడానికి ఇది మొదటి అడుగు. మేము ఏ కారణం కోసం పోరాడుతున్నామో దానిని ప్రభుత్వం మరింతగా అర్థం చేసుకుంటుందని నేను నమ్మకంగా ఉన్నాను. ఫెడరేషన్‌కు మహిళా అధ్యక్షురాలు ఉంటే, అది మహిళా రెజ్లర్ల భద్రతకు మంచిది. ఇది దేశంలోని సోదరీమణులు, కుమార్తెల కోసం జరిగిన పోరాటం.

పద్మశ్రీని వెనక్కి తీసుకోను బజరంగ్ పునియా



కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాను. అయితే, పద్మశ్రీ నేను వాపస్ ఇచ్చాను. దానిని మళ్లీ తిరిగి తీసుకోను. మన సోదరీమణులు కుమార్తెల గౌరవం కంటే ఏ అవార్డు గొప్పది కాదు. న్యాయం జరిగిన తర్వాతే పద్మశ్రీని వెనక్కి తీసుకోవడం గురించి ఆలోచిస్తాను.

సంతృప్తి స్థాయిలో సుపరిపాలన

- సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళి

ప్రజాశక్తి-వేంపల్లె/సింహాద్రిపురం (వైఎస్ఆర్ జిల్లా)

భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలు తీర్చే పథకాలతో ప్రభుత్వంపై వారి నమ్మకాన్ని రెట్టింపు చేసేలా సంతృప్తి స్థాయిలో సుపరిపాలన కొనసాగిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఆయన వైఎస్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సింహాద్రిపురంలో రూ36.03 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో పులివెందుల రూరల్ మండలం సింహాద్రిపురంలో వేర్వేరుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో పులివెందుల అర్బన్ డవలప్‌మెంట్ ఆథారిటీ (పాడా) అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా చోట్ల సిఎం జగన్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సంతృప్తికరంగా ప్రజలకు అందించేందుకు పడుతున్నామన్నారు. వ్యవస్థ సక్రమంగా నడవాలంటే ఎక్కడా వివక్షకు తావు ఇవ్వకూడదనేదే ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపి అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ధనుంజయరెడ్డి, కలెక్టర్ విజయ్‌రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఘాట్‌లో సిఎం జగన్

విశాఖ స్టీల్ జిందాల్ ఒప్పందం రద్దు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంటులో ఆధునిక బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రైవేటుకు అప్పగించేందుకు జిందాల్ స్టీల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 23 నెలల క్రితం కావాలని బ్లాస్ట్ ఫర్నేస్-3ని మూసివేసిందని తెలిపారు. ముడిసరుకు కొనడానికి నిధులు లేవనే పేరుతో స్టీల్‌ప్లాంటు ఉత్పత్తి తగ్గించి నష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. ఇప్పుడు 3వ ఫర్నేస్‌ను నడిపేందుకు సెయిల్‌ను కాదని ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ) పేరుతో జిందాల్‌కు అప్పగిస్తూ ఒప్పందం చేసుకుందని, దాన్ని రహస్యంగా ఉంచిందని తెలిపారు. దొడ్డిదారిన ప్రైవేటుపరం చేయడానికి కేంద్రం వ్యూహాత్మకంగా ఇలా వ్యవహరిస్తోందని, విశాఖ ఉక్కును కక్షపూరితంగా అమ్మినా, మూసినా రాష్ట్ర ప్రజానీకం అంగీకరించదని హెచ్చరించారు. ఉక్కు కార్మికులు చేస్తున్న ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున సంఘీభావం ప్రకటించారు. జిందాల్ కంపెనీతో ఒప్పందమంటే ప్రైవేటు కంపెనీలను ఏదో విధంగా ప్లాంట్‌లోకి జొప్పించాలని, గతంలో పోస్కో కంపెనీతో ఒప్పందం చేయాలని ప్రయత్నించి, నూరుశాతం అమ్మాలని నిర్ణయించి పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు చేసి అమ్మే విధంగా జిందాల్ ప్రైవేటు కంపెనీతో ఒప్పందం చేసిందని పేర్కొన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) కేంద్ర ప్రభుత్వ రంగ స్టీల్ పరిశ్రమని, భిలాయ్, బొకారో, దుర్గాపూర్ పరిశ్రమలు ఇందులో ఉన్నాయని, దానితో ఒప్పందం ద్వారా సెయిల్‌కు దక్షిణ భారతదేశంలో స్టీల్ అమ్ముకోడానికి మార్కెట్ సౌకర్యం పెరుగుతుందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంటు నడపడానికి కావాల్సిన ముడిసరుకును పంపగలిగే శక్తి సెయిల్‌కు ఉందని వివరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, సెయిల్ రెండూ కేంద్ర ప్రభుత్వ సంస్థలని, వీటి మధ్య ఒప్పందం జరిగితే రెండిటికీ లాభం ఉంటుందని, దేశానికి ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ప్రైవేటు కంపెనీని చేర్చడం ద్వారా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తారని, రిజర్వేషన్లు ఉండవని, ప్రైవేటు కంపెనీలు తమ లాభాల కోసం ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నాశనం చేసేటువంటి తప్పుడు చర్యని పేర్కొన్నారు. తీవ్రంగా నష్టాన్ని కలిగించే జిందాల్‌తో ఒప్పందాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అదనపు డోస్ అవసరం లేదు

న్యూఢిల్లీ : దేశంలో కొవిడ్ కొత్త సబ్‌వేరియంట్ జెఎన్.1 కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సబ్‌వేరియంట్‌ను నిరోధించేందుకు అదనపు మోతాదు వ్యాక్సిన్ అవసరంలేదని సార్స్-కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం చీఫ్ డాక్టర్ ఎస్.కె. అరోరా తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఉపరకం వ్యాపించకుండా ప్రజలు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. గతంలో వెలుగు చూసిన ఉపరకానికి, దీనికి మధ్య వ్యాధి లక్షణాల్లో పెద్దగా వ్యత్యాసం లేదన్నారు. 60 ఏళ్లు పైబడిన వారు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స తీసుకుంటున్నవారు, ఒకటి కంటే ఎక్కువ వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ ఉపరకంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మేలని, అదనపు డోస్ వ్యాక్సిన్ అవసరం లేదని అన్నారు. ఇప్పటి వరకు ఒమిక్రాన్‌లో 400కు పైగా ఉపరకాలను గుర్తించామని, ఇవి మార్పు చెందుతూనే ఉన్నాయని అన్నారు. భారత్‌లో అక్టోబర్ చివరి వారం నుండి ఇప్పటివరకు 8 వారాలలో 22 కేసులు నమోదయ్యాయని, ఇది వేగంగా వ్యాప్తి చెందుతుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు.

ముగ్గురు గుజ్జర్ల కస్టడీ మృతిపై మిన్నంటిన నిరసనలు

- కేంద్రం ఉక్కుపాదం
- ఇంటర్నెట్ కనెక్టివిటీ నిలిపివేత

'ధరణి' ప్రక్షాళన

- ప్రభుత్వ భూములను పేదలకు పంచుతాం
- కలెక్టర్లు, ఎస్‌పిల సదస్సులో తెలంగాణ సిఎం రేవంత్

కాల్పుల విరమణ కోరలేదు

- వెల్లడించిన బైడెన్
- నెతన్యాహుతో సుదీర్ఘంగా ఫోన్‌లో చర్చలు

• లోపలి పేజీలో..!

దత్, సాబ్జీల మరణం ఉద్యమాలకు తీరని లోటు

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎంఎకె దత్, పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీల మరణం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఉద్యమాలకు తీరని లోటు అని సంస్మరణ సభలో పలువురు వక్తలు అన్నారు. నమ్మిన ఆశయాల కోసం కడదాకా ఉద్యమాలతోనే వారు ప్రయాణం చేశారని కొనియాడారు. భౌతికంగా మరణించినా వారి ఆశయాలు, చూపిన బాట సజీవంగానే ఉంటాయని తెలిపారు. ఎంబి విజ్ఞాన కేంద్రంలో దత్, సాబ్జీల సంస్మరణ సభ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా ఇరువురి చిత్రపటాలకు యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు కె జోజయ్య, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దత్, సాబ్జీ నిరంతరం ప్రజా ఉద్యమాలతో ఉంటూ ప్రజల కోసం తమ జీవితాలను అర్పించారని అన్నారు. సాబ్జీ శాసనమండలిలో ప్రజా, కార్మిక, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిత్యం గళం విప్పి ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీసేవారని చెప్పారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపి వస్తూ అకాల మరణం చెందటం ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, కత్తి నరసింహారెడ్డి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్, పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జోజయ్య, పి బాబురెడ్డి, సీనియర్ నాయకులు సి కమలకుమారి, డి మస్తాన్‌రావు, తెలంగాణ యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావా రవి, బి నరసింహారావు, మిగతా 2లో

ఎంఎకె దత్, షేక్ సాబ్జీల చిత్రపటాల వద్ద నివాళుల్వరిస్తున్న నాయకులు

హామీలు అమలు చేయాల్సిందే

- కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె
- పలుచోట్ల మోకాళ్లపై నిలబడి నిరసన

అనంతపురం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కాకినాడలో మోకాళ్లపై నిల్చునినిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ సిబ్బంది

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెను కొనసాగించారు. మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరింది. అన్ని విభాగాల ఉద్యోగులనూ క్రమబద్ధీకరించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని నినదించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాకినాడలో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో చెవిలో పువ్వులు పెట్టుకుని సమ్మెలో పాల్గొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీములు అమలు పరచాలని ప్లకార్డులను ప్రదర్శించారు. తూర్పుగోదావరి జిల్లా డిఇఒ కార్యాలయం వద్ద దీక్షలను కొనసాగించారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట మోకాలిపై నిల్చొని నిరసన తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని యుటిఎఫ్ నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు.

సమస్యల పరిష్కార విషయాన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి చర్చించే సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. కృష్ణా, పల్నాడు, కర్నూలు జిల్లాల్లో దీక్షలు కొనసాయి.

26 నుంచి సమ్మె యథాతథం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంటు, సమాన పనికి సమాన వేతనంతోపాటు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 26వ తేదీ నుండి చేపట్టనున్న సమ్మె యథాతథంగా కొనసాగుతుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి సమక్షంలో ఈ నెల 14న జరిగిన చర్చల్లో డిమాండ్లపై స్పష్టమైన హామీ రాలేదని తెలిపారు. సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా సానుకూల స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ నుండి సమ్మె చేపడతామని హెచ్చరించారు. తెల్లవారుజాము నుండి కార్మికులు చేపట్టబోయే సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజా, కార్మిక సంఘాలు మద్దతివ్వాలని ఉమామహేశ్వరరావు కోరారు.

లక్షమంది కార్మికులు తైవాన్‌కు పోతున్నారా..?

- యుఎస్ నివేదికపై దుమారం

న్యూఢిల్లీ : భారతదేశం నుంచి తైవాన్‌కు లక్ష మంది కార్మికులు పోతున్నారన్న యుఎస్ నివేదికపై తైవాన్ కార్మిక మంత్రి సు మింగ్-చున్ నుంచి వెలువడిన ఒక ప్రకటన కలకలం రేపింది. మంత్రి సు మింగ్-చున్ మాట్లాడుతూ.. 'భారతదేశం నుంచి ఒక లక్ష మంది వలస కార్మికులను తైవాన్‌కు తీసుకురావడానికి మా ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేదని, ఈ అంశం ఉపాధి సహకారానికి సంబంధించిన అంశమని తెలిపారు. వలస కార్మికులను తీసుకురావడానికి తైవాన్ భారత్‌తో ఎలాంటి అవగాహనా ఒప్పందం (ఎంఒయూ)పై సంతకం చేయలేదని సు మింగ్-చున్ చెప్పారు. లక్ష మంది భారతీయ కార్మికులకు తలుపులు తెరిచేందుకు తైవాన్ తన డిమాండ్‌కు సంబంధించి చేసిన ఏవైనా వాదనలు నకిలీవని సు మింగ్-చున్ నొక్కి చెప్పారు.

ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజల అభిప్రాయాలను తారుమారు చేయాలనే దురుద్దేశంతో ఈ వాదనలు చేస్తున్నారని ఆయన అన్నారు. సు మింగ్ యొక్క ఈ వ్యాఖ్య కుమింటాంగ్ (కెఎంటి) అధ్యక్ష అభ్యర్థి హౌ యు-ఇహ్ ఇచ్చిన ప్రకటన సందర్భంలో వచ్చింది. వార్తా సంస్థ ప్రకారం, సిఎన్ఎ నివేదించిన ప్రకారం, భారతీయ వలస కార్మికులను తీసుకురావడానికి ఎంఒయూ కుదుర్చుకున్నట్టు (కెఎంటి) నామినీ హౌ మీడియా నివేదికను ఉదహరించిన తర్వాత సు మింగ్-చున్ సంతకంతో ఉన్న ప్రకటన వచ్చింది.

నివేదికలో ఏమున్నదంటే...

ఎంప్లాయి మొబిలిటీ అగ్రిమెంట్ ప్లాన్ చేస్తున్నట్టు ఈ నివేదికలో పేర్కొన్నారు. లక్ష మందికి పైగా భారతీయ వలస కార్మికులను తైవాన్‌కు తీసుకువచ్చే ఒప్పందంపై ఈ ఏడాది డిసెంబర్‌లో సంతకం చేయవచ్చని కొంతమంది సీనియర్ అధికారులు అమెరికన్ మీడియా నివేదికల ద్వారా పేర్కొన్నారని తైవాన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (సిఎన్ఎ) తెలిపింది.తైవాన్, భారతదేశంల మధ్య... వలస కార్మికులను తీసుకురావడానికి ఏడాది చివరి నాటికి అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి ఇరుదేశాలు సిద్ధంగా ఉన్నాయని నవంబర్‌లో హెచ్ఎస్‌యూ చెప్పిందని హౌ కార్యాలయం శనివారం తెలిపింది, 2023 ముగియడానికి ఇంకా 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున. ఎంఒయూపై ఎప్పుడు సంతకం చేస్తారు, ఒప్పందం ప్రకారం ఎంత మంది భారతీయ కార్మికులు తైవాన్‌కు వస్తారో హెచ్ఎస్‌యు స్పష్టం చేయాలి. నవంబర్ 13న స్థానిక మీడియాతో మాట్లాడిన హ్సు మింగ్-చున్, క్యాబినెట్ ఈ ప్రణాళికపై సంతకం చేసిన తర్వాత వలస కార్మికులను తీసుకురావడానికి తైవాన్ , భారతదేశం సంవత్సరాంతానికి ఎంఒయూ సంతకం చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.

'ధరణి' ప్రక్షాళన

- ప్రభుత్వ భూములను పేదలకు పంచుతాం
- కలెక్టర్లు, ఎస్‌పిల సదస్సులో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

కలెక్టర్లు, ఎస్‌పిల సదస్సులో మాట్లాడుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

భూ లావాదేవీలకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. గత పాలకులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి రెగ్యులరైజేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. మరి కొన్ని ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంచిన అసైన్డ్ భూములను కూడా లాక్కొన్నారని విమర్శించారు. కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచుతామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆదివారం ఆయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలుకు ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు అన్ని గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహించి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. అనంతరం ఎవరు ఏ పథకానికి అర్హులో పారదర్శకంగా ఎంపిక చేయాలని సూచించారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో రాజకీయ కక్షలకు తావులేదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు. డ్రగ్స్, నకిలీ విత్తనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యాల మేరకు అధికారులు నడుచుకోవాలన్నారు.

ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల అభిప్రాయాలను సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు, సిఎస్, వివిధ శాఖల కార్యదర్శులు, సిఎంఒ అధికారులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపు కోరుతూ.. 36 గంటల ధర్నా

- జనవరి 9, 10 తేదీల్లో యుటిఎఫ్ నిర్వహణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ జనవరి 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల ధర్నా చేపట్టనున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశ నిర్ణయాలను ఒక ప్రకటన ద్వారా వారు వెల్లడించారు. సుమారు రూ.18 వేలకోట్ల వివిధ రకాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్‌లోపు అన్ని బకాయిలూ చెల్లిస్తామని మంత్రులు, అధికారులు గత ఆగస్టులో నిర్వహించిన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదని విమర్శించారు. బకాయిలు కోసం ఎప్పుడు ప్రాతినిధ్యం చేసినా తరువాత నెలలో ఇస్తామని చెప్పడం తప్ప ఆచరణలో ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయని అన్నారు. చెల్లింపులో అలసత్వానికి నిరసనగానూ, వెంటనే చెల్లించాలని కోరుతూ 36 గంటల ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేయాలని, ఓట్‌ఫర్ ఒపిఎస్ పిలుపును విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించడం కోసం అవసరమైతే అదనంగా ఒక గంట పాఠశాలలో సమయం కేటాయింపు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, ఎఎన్ కుసుమకుమారి, కోశాధికారి బి గోపీమూర్తి, కార్యదర్శులు లక్ష్మిరాజా, ఎస్‌పి మనోహర్ కుమార్, ఎస్ మురళీమోహన్, ఎన్ నవకోటేశ్వరరావు, ఎన్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలితో మాట్లాడుతున్న అండ్ర మాల్యాద్రి, ఇతర నాయకులు

దళితురాలిపై దాడి కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ (గుంటూరు జిల్లా)

స్పార్కిరింగ్ మోటారు షెడ్డులో మేనేజర్‌గా పని చేస్తున్న దళిత మహిళపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని బాధితురాలిని కెవిపిఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ మండల పరిధిలోని ఇన్నర్ రింగురోడ్డు పక్కన షేక్ అబ్దుల్ కరీం స్పార్కిరింగ్ మోటర్ షెడ్‌లో దళితురాలు పెద్దపల్లి వసుంధరదేవి మేనేజర్‌గా మూడేళ్ల నుండి పని చేస్తున్నారని తెలిపారు. ఆ షెడ్ యజమానితో స్థలం విషయమై లంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి వివాదం ఉందని, ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి తరచూ షెడ్డు యజమాని లేని సమయంలో వచ్చి ఖాళీ చేయాలంటూ గొడవ చేస్తుండేవాడని చెప్పారు. ఈ నెల 18న కూడా ముగ్గురు గుర్తుతెలియని వాళ్లు వచ్చి గొడవ చేశారని, మరుసటి రోజు శ్రీనివాసరెడ్డి, అతని అనుచరులు సుమారు 70 మందితో షెడ్డుకి వచ్చి సిసి కెమెరాలు, లైట్లు పగలగొట్టారని, పొక్లెయినర్ల ద్వారా షెడ్డులోని కార్లను తొలగించారని తెలిపారు. ఇది తెలిసిన వసుంధర అక్కడికి వచ్చి అడ్డుకోబోగా ఆమెను కులం పేరుతో దూషించారని, భౌతిక దాడి చేశారని తెలిపారు. గాయపడిన ఆమెను పోలీసులు ఆస్పత్రికి తరలించారని, దీనిపై వసుంధరాదేవి పెదకాకాని పోలీసులకూ ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ ఘటనలోని నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జి అరుణమ్మ, సిఐటియు నాయకులు చింతల శ్రీనివాస్, ఎన్ శివాజి ఉన్నారు.

42 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న ఎంపి మోపిదేవి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్ రావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్.

ప్రజాశక్తి-చెరుకుపల్లి (బాపట్ల జిల్లా)

మహాత్మ జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల మహోత్సవం కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గుంటూరు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానకి ముఖ్యఅతిథిగా రాజ్యసభ ఎంపి మోపిదేవి వెంకటరమణ రావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ) పివిజె రామారావు హాజరయ్యారు. 42 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను వారు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 2008 నుండి జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులను స్వయంగా ఎంపిక చేసి వారికి అవార్డులను అందజేయడం అభినందనీయమన్నారు.

గేయానంద్, డిఇఒ రామారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం కృషి చేస్తూ, గురువులను గుర్తించి వారి సేవలకు తగిన గుర్తింపునిస్తున్న లక్ష్మణరావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఎంపిపి రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

ముగ్గురు గుజ్జర్ల కస్టడీ మృతిపై మిన్నంటిన నిరసనలు

- కేంద్రం ఉక్కుపాదం
- ఇంటర్నెట్ కనెక్టివిటీ నిలిపివేత

జమ్ము: రాజౌరి, పూంచ్ సెక్టార్ పరిధిలో ముగ్గురు అమాయక గిరిజన పౌరులను విచారణ పేరుతో హింసించి చంపిన తాజా సైనిక చర్యపై జమ్మూ కాశ్మీర్‌లో నిరసనలు మిన్నంటాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. నిరసనలపై ఆంక్షల కొరడా ఝుళిపించింది. ముందస్తు అరెస్టులు, ఇంటర్నెట్ కనెక్టివిటి నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టింది. జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతమైనందున ఈ ప్రాంత పాలనా నిర్వహణ అంతా లెఫ్టినెంట్ గవర్నరు ద్వారా కేంద్ర ప్రభుత్వమే నియంత్రిస్తుంది. జమ్మూలోని పీర్ పంజాల్ ప్రాంతంలో సైనిక వాహనంపై ఉగ్రవాదులు జరిపిన మెరుపు దాడిలో నలుగురు సైనికులు చనిపోయిన మరుసటి రోజే ముగ్గురు గుజ్జర్లను కస్టడీలోకి తీసుకుని హింసించి చంపినట్లు ఆర్మీ ఆరోపణలు ఎదుర్కొంటోంది. మరణించినవారి బంధువులకు ఉద్యోగాలు, పరిహారం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇది నేరం అంగీకరించినట్టేనని పలువురు భావిస్తున్నారు. ఆర్మీపై తీవ్ర విమర్శలు రావడంతో పౌర మరణాలపై జరిగే విచారణకు తాము సహకరిస్తామని ఒక ప్రకటన విడుదల జేసింది. తోపా మస్తాందార గ్రామానికి చెందిన ఎనిమిది మంది వ్యక్తులతో సహా గత కొన్ని రోజులుగా అనేక మంది వ్యక్తులను సైన్యం తీసుకెళ్లి ఇంటరాగేట్ చేస్తోందని స్థానికులు తెలిపారు. వీరిలో ముగ్గురు చనిపోగా, మిగతావారు మృత్యువు తో పోరాడుతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. చనిపోయిన ముగ్గురు గుజ్జర్లను సఫీర్ హుస్సేన్ (37), షౌకత్ హుస్సేన్ (26), షబీర్ అహ్మద్ (32)గా గుర్తించారు. రెండు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతం నుండి తీవ్రవాదాన్ని తుద ముట్టించడంలో ముస్లిం గుజ్జర్లు కీలక పాత్ర పోషించారు. 2020లో షోఫియాన్‌లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు రాజౌరి ప్రాంత పౌరులను, గుజ్జర్లను చంపివేసిన ఆర్మీ కెప్టెన్‌కు సాయుధ దళాల ట్రిబ్యునల్ జీవిత ఖైదు విధించింది. ఆ తరువాత నెల రోజులకే ముగ్గురు గుజ్జర్ల కస్టడీ మరణాలు చోటు చేసుకున్నాయి. కస్టడీలో చిత్ర హింసలకు గురి చేసిన దృశ్యాలతో కూడిన వీడియో క్లిప్‌లు వైరల్ అయ్యాయి. ఆ వీడియో వాస్తవికతను తోపా మస్తాందర గ్రామ సర్పంచ్ మొహమ్మద్ అహ్మద్ ధ్రువీకరించారు. ఆర్మీ ఎత్తుకెళ్లిన ఎనిమిది మంది ఒకరికొకరు సంబంధమున్నవారని అహ్మద్ తెలిపారు. ఈ రోజు తెల్లవారు జామున అంత్యక్రియల కోసం ముగ్గురు పౌరుల మృతదేహాలను తమకు అప్పగించారని, అయితే ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వాటిని పూడ్చి పెట్టామని సర్పంచ్ చెప్పారు. ఈ హత్యలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ జమ్మూ కాశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు నిరసనలు చేపట్టాయి. పిడిపి నాయకురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజలు శాంతి ప్రేమికులు. ఉగ్రవాదానికి ఎన్నడూ మద్దతివ్వని ప్రాంతంలో ఈ భయానకమైన ఘటన జరిగిందని అన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రక్షణలు ఉపసంహరణ, రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చిన తరువాత ఈ ప్రాంతంలో అంతా బాగానే ఉందని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిలుక పలుకులు పలుకుతోంది. నిజానికి జమ్మూ కాశ్మీర్ ను ఒక బహిరంగ జైలుగా మారిపోయింది. సామాన్యులకు భద్రత లేని పరిస్థితి సంపన్న కాశ్మీర్ అంటే ఇదేనా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

శ్రీనగర్‌లో ఆందోళన చేస్తున్న స్థానికులు

భోగాపురం విమానాశ్రయంపై రూ.675 కోట్ల పెట్టుబడి

- ఒప్పందం కుర్చుకున్న ఎన్ఐఐఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, నిర్వహించడానికి నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ లిమిటెడ్ (ఎన్ఐఐఎఫ్) రూ.675 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. జిఎంఆర్ గ్రూప్ అభివృద్ధి చేస్తున్న ఈ విమానాశ్రయంపై ఇటీవల ఒప్పందం చేసుకున్నట్లు ఎన్ఐఐఎఫ్ మాస్టర్ ఫండ్ మేనేజింగ్ పార్టనర్ వినోద్ గిరి తెలిపారు. ఎన్ఐఐఎఫ్ మాస్టర్ ఫండ్ రవాణా, ఇంధనం, డిజిటల్ వ్యవస్థాపనలో బలమైన, విభిన్నమైన పోర్ట్‌ఫోలియోతో భారతదేశంలో అతిపెద్ద మౌలిక సదుపాయాల నిధి అని అన్నారు. జిఆర్ఆర్ గోవా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ తరువాత ఎన్ఐఐఎఫ్ పెట్టుబడి పెట్టుబడి పెట్టిన రెండవ విమానాశ్రయం ఇదే అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర కనెక్టివిటి, రవాణా, మౌలిక సదుపాయాలను పెంచడానికి భోగాపురం విమానాశ్రయం మంచి స్థానంలో ఉంటుందని జిఎంఆర్ గ్రూప్ తెలిపింది. సరికొత్త ప్రపంచస్థాయి విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ సామాజిక, ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని జిఎంఆర్ గ్రూప్ బిజినెస్ ఛైర్మన్ జిబిఎస్ రాజు పేర్కొన్నారు.

చేను చెక్కిన శిల్పాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, సాహితీవేత్తలు, సోమేపల్లి వెంకట సుబ్బయ్య కుటుంబ సభ్యులు

'సోమేపల్లి' సేవలు చిరస్మరణీయం

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు సాహిత్య రంగంలో కవిగా, గుంటూరు జిల్లా రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులుగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమేపల్లి సంస్మరణ సభ ఆదివారం గుంటూరులోని ఎస్‌విఎన్ కాలనీలోని చిన్మయ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా సోమేపల్లి వెంకటసుబ్బయ్య రచించిన 'చేను చెక్కిన శిల్పాలు' హిందీ అనువాద పుస్తకాన్ని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు ఆవిష్కరించారు. చలపాక ప్రకాష్ రచించిన 'అప్పగింతలు' కథా సంపుటిని డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, చిల్లర భవానిదేవి ఆవిష్కరించి సోమేపల్లికి అంకితం ఇచ్చారు. సోమేపల్లితో తమకుగల సాహితీ స్మృతులను కవులు, సాహితీవేత్తలు గుర్తు చేసుకున్నారు. తొలుత వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య కుమారులు, సభ్యులు వశిష్ట, విశ్వనాథ విరించి, రెండు తెలుగు రాష్ట్రాల సాహితీవేత్తలు, బంధుమిత్రులు, రెవెన్యూ, జడ్‌పి అధికారులు పాల్గొన్నారు.

ఎపి ప్రొఫెషనల్ ఫోరం చర్చావేదికకు హాజరైన నాయకులు

అప్పులు తెచ్చి దేనికి వాడారో తెలియదు

- ఎపి ప్రొఫెషనల్ ఫోరం చర్చావేదికలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి అప్పులు తీసుకొస్తున్న అధికారులు ఆ డబ్బులను ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పలేకపోతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎపి ప్రొఫెషనల్ ఫోరం ఆధ్వర్యాన ఆదివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక అరాచకత్వం రాజ్యమేలుతుందా? అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షులు నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ.. విభజనతో తీవ్ర ఆర్థికలోటులో ఉన్న రాష్ట్రాన్ని ఆర్థికలోటు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాలు అలా కాకుండా అప్పులు పెంచుకుంటూ పోతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆర్థిక ఎమర్జెన్సీ ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో అప్పులు రూ.పది లక్షల కోట్లు దాటిపోయాయని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం బటన్ నొక్కడానికి సుమారు రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిందనుకున్నా మిగతా అప్పు ఏమి చేసిందో చెప్పాలన్నారు. ఇటువంటి ఆర్థిక అరాచకత్వం మీద అందరం కలిసి పోరాడాలని సూచించారు. ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. అప్పులు చేసే విషయంలో ఐఎఎస్ అధికారులు బ్యాంకులకు ఎందుకు సహకరిస్తున్నారని ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. చేస్తున్న అప్పులు ప్రాజెక్టుల రూపంలో కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళుతున్నాయని, ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోతున్నాయని అన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక అరాచకాలను కరపత్రం రూపంలో ప్రజలకు వివరించాలని కోరారు. డిబిఎఫ్ అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. అప్పులు, అరాచకాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐయుఎంఎల్ నాయకులు బషీర్ అహ్మద్, సిఎ ఛార్టర్డ్ అకౌంటెంట్ ఎం శ్రీరామమూర్తి, జర్నలిస్టు చెవుల కృష్ణాంజనేయులు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దత్, సాబ్జీల మరణం ఉద్యమాలకు తీరని లోటు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌టియు అధ్యక్షులు ఎల్ సాయిశ్రీనివాస్, ఎపిటిఎఫ్-1938 ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఎపిసిపిఎస్ఎ ప్రధాన కార్యదర్శి కె రాజేశ్వరరావు, నాయకులు పటాన్ బాజీ, సిఎం దాస్, హుస్సేన్, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ.. గణిత ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించిన దత్ విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని కలిగించేలా చేసి మంచి ఉపాధ్యాయుడు అయ్యారని అన్నారు. మరోవైపు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఉద్యమ శిక్షణ తరగతుల్లో బోధన ద్వారా అనేక మంది కార్యకర్తలను నాయకులుగా మార్చారని పేర్కొన్నారు. సాబ్జీ మరణం వరకూ ఉద్యమాలతోనే ఉన్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధిగా అందరి సమస్యల పరిష్కారం కోసం, వారికి అందుబాటులో ఉంటూ కృషి చేశారని అన్నారు. సిపిఎస్ రద్దు కోసం బైకు జాతాలు, పాదయాత్రలు జయప్రదంగా జరగటానికి కృషి చేశారని చెప్పారు. ప్రభుత్వాలు వ్యవస్థలన్నింటినీ విధ్వంసం చేస్తున్న సమయంలో ప్రశ్నించే గొంతులైన దత్, సాబ్జీలను కోల్పోవడం బాధాకరమన్నారు. సాబ్జీ భార్య సుభానీ బేగం, కుమారుడు ఆజాద్ వారి అనుభవాలను పంచుకున్నారు.

రెజ్లర్ల పోరుతో దిగొచ్చిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

డబ్ల్యూఎఫ్ఐ నూతన కార్యవర్గం రెజ్లింగ్‌కు సంబంధించి ఎటువంటి కార్యకలాపాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు వీల్లేదు' అని క్రీడాశాఖ పేర్కొంది. సంజయ్ సింగ్ సారథ్యంలోని డబ్ల్యూఎఫ్ఐ.. అటు సమాఖ్య సొంత నిబంధనలు, ఇటు జాతీయ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్‌ను పాటించలేదని క్రీడాశాఖ తన ఉత్వర్వుల్లో తెలిపింది. ఈ నెల 21న సంజయ్ సింగ్ ఎన్నికకు వ్యతిరేకంగా సాక్షిమాలిక్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలకగా, పూనియాతో పాటు డెఫ్లింపిక్స్ బంగారు పతక విజేత వీరేందర్ సింగ్ యాదవ్ కూడా తమ పద్మశ్రీ అవార్డులను వెనక్కి ఇస్తున్నట్లు ప్రకటించడం, వివిధ రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఈ విషయంలో మద్దతుగా రంగంలోకి దిగుతామని హెచ్చరించిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

అంబరాన్నంటిన పిల్లల సంబరాలు

(మొదటిపేజీ తరువాయి)

అభినందనీయమని అన్నారు. ప్రాచీన, జానపద కళలు, సాహిత్యమే నేటి సినీ సాహిత్యానికి మూలాధారమని తెలిపారు. బాలోత్సవ కార్యక్రమాల నిర్వహణ ద్వారా సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలలో పిల్లలు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడం ద్వారా వారిలో మరింత ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ భార్య డాక్టర్ మానస, తపన ఫౌండేషన్ ఛైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆయన సతీమణి రేణుక, నాగహనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ టెక్నికల్ డైరెక్టర్ టి.భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాంసుందర్, బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, అమరావతి బాలోత్సవం నిర్వాహకులు రామరాజు, కాకినాడ క్రియా బాలోత్సవం నిర్వాహకులు జగన్నాథరావు, జంగారెడ్డిగూడెం బాలోత్సవం నిర్వాహకులు సూర్యారావు, దేవరపల్లి బాలోత్సవం నిర్వాహకులు ఉండవల్లి కృష్ణారావు, హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం నాయకులు మారుబోయిన కోటేశ్వరరావు, పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని పాలడుగు నాగయ్య చౌదరి కొత్త రఘురామయ్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పల్నాడు బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పల్నాడు జిల్లా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారులు సహజంగా ఎదగడానికి బాలోత్సవాలు దోహదం చేస్తాయని వివరించారు. బాలోత్సవంలో లఘు నాటికలు, జానపద నృత్యం, పాటలు, ప్రాజెక్ట్ వర్క్, రంగవల్లులు, కోలాటం, విచిత్ర వేషధారణ, వక్తృత్వం, కథలు చెప్పడం, బుర్రకథ, మట్టితో బొమ్మల తయారీ, పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జానపద నృత్యం, కోలాటం ప్రదర్శనకు విశేష స్పదన లభించింది. గ్రామీణ వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు విద్యార్థులు తమ ఆటపాటల్లో చూపారు. దేశభక్తి, కుటుంబ బాధ్యవ్యాల విలువ, అభ్యుదయం తదితర గేయాలు ఆకట్టుకున్నాయి. అన్ని విభాగాల్లోనూ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలోత్సవ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, కార్యదర్శి కట్ట కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కోశాధికారి కోయా రామారావు, విజ్ఞాన కేంద్రం కమిటీ కన్వీనర్, గద్దె చలమయ్య, సభ్యులు కామినేని రామారావు పాల్గొన్నారు.

కర్నూలులో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపిన అంగన్‌వాడీలు

శ్రీకాకుళంలోని నాగావళి నదిలో జలదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

గుంటూరులో డోలు వాయిస్తూ బుర్ర కథ చెబుతున్న అంగన్‌వాడీలు

కొవ్వొత్తులతో ప్రదర్శన

- ఆట, పాటల ద్వారా నిరసన
- 13వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి- యంత్రాంగం

గత 13 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఆట, పాటలతో నిరసన తెలిపారు. వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. కర్నూలులోని ధర్నాచౌక్‌లో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞానోదయమై మనస్సు మారి అంగన్‌వాడీల జీవితాలలో వెలుగులు నింపాలంటూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, కోడుమూరుల్లోనూ కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరం నుంచి కొవ్వొత్తులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చాగలమర్రిలో సమ్మె శిబిరంలో కేక్‌కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. అనంతపురం జిల్లాలో అనంతపురం, పుట్లూరు, నార్పల, గుత్తి, శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ, ఓబుళదేవరచెరువు, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. వారి పోరాటానికి మద్దతుగా అక్కడే అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, విద్యార్థి యువజన, మహిళా ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. గాజువాక, పెందుర్తి, భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాల్లోనూ, ఆనందపురం మండలం పాలవలస, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగానూ అంగన్‌వాడీలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నక్కపల్లిలో సమ్మె శిబిరం వద్ద కోలాటం ఆడారు. అల్లూరి జిల్లా ఎటపాక సమ్మె శిబిరంలో 'లేలే అంగన్‌వాడీ అక్కా', 'నడిచే గాయమా నారీ లోకమా' అంటూ పలు గేయాలు పాడి నృత్యాలు చేశారు. విఆర్.పురం, సీలేరు, రాజవొమ్మంగి, పెదబయలు ప్రాంతాల్లో కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు. అరకులోయలో ఉరి తాళ్లతో నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా శాంతిపురం, వికోటలో వంటి కాలిపై నిలబడ్డారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వరి, రేణిగుంటలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమలత మద్దతు తెలిపారు. బాలాయపల్లి, ఏర్పేడు, గూడూరు, పుత్తూరులో అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్షలు, తిరుపతిలోని సుందరయ్య నగర్‌లో లబ్ధిదారులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ సందర్శించి మద్దతు తెలిపారు. ఐక్యం పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. బాపట్లలో అంగన్‌వాడీల రిలే దీక్షలకు ఆర్‌టిసి స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు, ప్రకాశం జిల్లా కొండపిలో రైతు సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. సిఎస్‌పురం, బాపట్లలో అంగన్‌వాడీలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గుంటూరులోని కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో బుర్రకథ చెప్పి, మంగళగిరి, కొల్లిపరలో మోకాళ్ల నిలబడి నిరసన తెలియజేశారు. మంగళగిరిలో చేనేత కార్మిక సంఘం సంఘీభావం తెలిపింది. తుళ్లూరులో పిల్లలతో కలిసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. తాడికొండ, పెదకాకానిలో ఒంటికాలిపై నిరసన తెలపడంతోపాటు శిబిరంలో సెమీ క్రిస్మస్ చేసుకున్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో సమ్మె శిబిరం కొనసాగింది. వినుకొండలో ఒంటికాలిపై నిలిచి నిరసన తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలో అంగన్‌వాడీలు హరిదాసు వేషంలో పాటలు పాడుతూ నిరసన తెలిపారు. గన్నవరం మండలం బుద్ధవరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగించారు. విజయవాడలో అంగన్‌వాడీల సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం భేషజాలకు పోకుండా చర్చల ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. బెదిరింపులకు దిగి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే రాష్ట్రంలోని కార్మిక వర్గం అంగన్‌వాడీకి అండగా నిలిచి ప్రభుత్వానికి గుణపాఠం చెప్తుందని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు మద్దతుగా నెల్లూరులో ఐద్వా, డివైఎఫ్ఐ నగర కమిటీల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరంలో కొవ్వొత్తులతో భీమవరం, పోడూరు, పెనుమంట్ర, ఉండిలో కొవ్వొత్తులతో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఏలూరులో మోకాళ్లపై నిలబడి, జీలుగుమిల్లి చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మండపేటలో నిరసన దీక్ష చేపట్టారు. రామచంద్రపురంలో ప్లకార్డులతో, కాకినాడ జిల్లా కరపలో ఒంటికాలిపై నిలబడి, పెద్దాపురంలో విజిల్స్ ఊదుతూ నిరసన తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాలతో పాటు బొబ్బిలి, జామి, ఎస్.కోట, సీతంపేటల్లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. విజయనగరం, రాజాం, గజపతినగరంలో సెల్‌ఫోన్లకు, చీరలకు పూజలు నిర్వహిస్తూ నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని నాగావళి నదిలో జలదీక్ష, ఎచ్చెర్లలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

వినయోగదారుల దినోత్సవ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తదితరులు

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం-2023 సందర్భంగా ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు కల్పిస్తున్న హక్కులు, రక్షణ గురించి, శాఖలు, సంఘాల ద్వారా అందిస్తున్న సేవలపై వివరించారు. ప్రతియేటా డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పండగలా జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. 6 వేల పాఠశాలలు, 500 ఇంటర్మీడియట్ కళాశాలలు, 175 డిగ్రీ కాలేజీల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. పౌర సరఫరాలశాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. వినియోగదారుల చట్టంపై అవగాహన లేకపోవడం వల్లే మోసాలు జరుగుతున్నాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని విలేజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఈ అంశంపై అవగాహన కల్పించి, వినియోగదారులకు అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డైరెక్టరు ఎం విజయ సునీత, ఎన్‌టిఆర్ జిల్లా వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులు ఎన్ చిరంజీవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

27 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ కోరారు. నగరంలోని అంబేద్కర్ భవన్ వద్ద ఆదివారం రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో విద్యారంగంలో ఉన్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలను రూపొందించుకోవడం కోసం ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణ్‌రావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ విఠలపు బాలసుబ్రహ్మణ్యం హాజరవుతారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం గంగాసూరిబాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టి రాజా, జిల్లా అధ్యక్షులు వరహాలు తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రాలో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో సెపక్ తక్రా అండర్-14 బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 23 వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరిగినట్లు చెప్పారు. జట్టు సభ్యులుగా పాక దుర్గా మధుర, కల్లేపల్లి వర్ధిని, కావ్య, విడదల వైష్ణవి, గుడేకల్ సన్వీత ఉన్నట్లు పేర్కొన్నారు. టీమ్ మేనేజర్ సతీష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందినట్లు తెలిపారు.

రాజకీయ వలసలు ప్రారంభం

- టిడిపి అధినేత చంద్రబాబు
- పార్టీలో చేరిన పలువురు నేతలు

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాజకీయ వలసలు ప్రారంభమయ్యాయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. జగన్‌ను ఇంటికి పంపాలని జనం చూస్తున్నారని చెప్పారు. పెదకూరపాడు, తణుకు, అమలాపురం, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరారు. టిడిపి కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి చంద్రబాబు ఆహ్వానించారు. తాను అందరివాడినని, ఏ ఒక్కడి వాడిని కాదని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆక్వా రైతులు కూడా పూర్తిగా దెబ్బతిన్నారని, హార్టికల్చర్ రైతులు నాశనమయ్యారని తెలిపారు. ఒక వ్యక్తి విధానాల వల్ల వ్యవస్థలు నాశనమైతే జీవితాలు నాశనం అవుతాయని, ఐదేళ్లలో ఇదే జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాకు అడ్డే లేదని, కృష్ణానదికి అడ్డుగా కట్టవేసి ఇసుకను దోచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే రెండు జిల్లాల్లో ఇసుక మాఫియాకు నేతృత్వం వహిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తున్న వారిపై అట్రాసిటీ కేసులు పెట్టి జైల్లో ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపాను వంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రభుత్వ సాయంతో కష్టం తగ్గించవచ్చునని తెలిపారు. కానీ మిచౌంగ్ సమయంలో ప్రభుత్వం కనీసం స్పందించలేదని విమర్శించారు. ప్రతియేటా జాబ్ కేలండరు ఇస్తానని హామీ ఇచ్చి ఒక్కటి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. విశాఖపట్నంలో గాదిరాజు ప్యాలెస్‌పై జగన్ కన్ను పడటంతో దాని యాజమానిపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. విషయం మీడియాలో రావడంతో యాజమానిని బెదిరించి ఎవరూ ఇబ్బంది పెట్టలేదని చెప్పించారని పేర్కొన్నారు. జగన్‌కు తన సినిమా అయిపోయిందని తెలిసిపోయిందని, అందుకే 92 మంది ఎమ్మెల్యేలను మారుస్తున్నారని తెలిపారు. మార్చాల్సింది జగన్‌ను అని ఎమ్మెల్యేలను కాదని అన్నారు. తాను అద్దె ఇంట్లో ఉంటే అనేక దాడులు చేసిన వ్యక్తి తన పుట్టినరోజు కోసం రూ.100 కోట్లతో సొంత పత్రికకు ప్రకటనలు ఇప్పించుకున్నారని తెలిపారు. తాను సూపర్ సిక్స్ ఇస్తానని ప్రకటించడంతో ఉచిత ప్రయాణం పెడతానని సిఎం అంటున్నారని వ్యాఖ్యానించారు. అమరావతిలో రూ.లక్షల కోట్ల ఆస్తిని జగన్ నాశనం చేశారని విమర్శించారు. రుషికొండను విధ్వంసం చేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కడుతున్నారని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అనగాని సత్యప్రసాద్, కొమ్మాలపాటి శ్రీధర్, రెడ్డి సుబ్రమణ్యం, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

టిడిపి కార్యాలయంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కా ఆనంద్‌బాబు, మద్దిరాల ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యాగం

చంద్రబాబు తన నివాసంలో మూడు రోజులుగా నిర్వహించిన చండీయాగం, సుదర్శన నారసింహ హోమం ఆదివారంతో ముగిశాయి. ఉండవల్లిలోని తన నివాసంలో తన సతీమణి భువనేశ్వరితో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దుర్గాపాపనేశ్వర ఆలయంలో కేంద్రమంత్రికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - లేపాక్షి (సత్యసాయి జిల్లా)

సత్యసాయి జిల్లా లేపాక్షి మండల కేంద్రలో ప్రసిద్ధి గాంచిన ఏకశిలా నంది, దుర్గా వీరభద్ర పాపానేశ్వర ఆలయాన్ని కేంద్ర టెలీ కమ్యూనికేషన్ సహాయ శాఖ మంత్రి దేవ్‌సిన్హా చౌహాన్ ఆదివారం సందర్శిం చారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ విశిష్టతను తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా లేపాక్షిలోని ఒరియంటల్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పేదలకోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. ఆయన వెంట పెనుగొండ సబ్ కలెక్టర్ భరత్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ కుమార్ రెడ్డి, ఎంపిడిఒ నరసింహ నాయుడు ఉన్నారు.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Home Finance

రిజిస్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరీ కుర్ల రోడ్డు, అంధేరీ ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచి ఆఫీసు: సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డోర్ నం.5-37-155, 4/15 బ్రోడిపేట్, గుంటూరు, ఆం.ప్ర.-522002.

ఏదైతే,
క్రింది సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
ఆ విధంగా మొత్తాలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని, దిగువ పేర్కొన్న తేదీలలో స్వాధీనంచేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు చెల్లింపులుచేయుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	దేవినెడి వెంకట నాగ సురేష్ (రుణగ్రహీత), దేవినేడి హారిక (సహ-రుణగ్రహీత) LHGTR00001323072.	డోర్ నం. 25-6-54, వార్డు నం.29, పాత వార్డు నం.17, కొత్త వార్డు నం.29, బ్లాక్-9, రామచంద్రాపురం, అగ్రహారం, టి.ఎస్. నం.580, గుంటూరు, ఆం.ప్ర.-522004. (రెఫరెన్స్ ఎల్ఎఎన్ నం. ఎల్‌హెచ్‌జిటిఆర్00001323072). సరిహద్దులు: ఉత్తరం: విశ్వనాథం ఇల్లు, దక్షిణం: రోడ్డు, తూర్పు: వెంకట పద్మావతి ఉమ్మడి గోడ, పడమర: సుబ్బారావు ఇల్లు. స్వాధీనతా తేది: 20 డిసెంబర్-2023.	10-10-2023 Rs. 9,44,015/-	గుంటూరు -బి

పై పేర్కొన్న రుణగ్రహీతలు/ హామీదారులుకు బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడుచున్నది, లేని పిమ్మట సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8&9 క్రింద నియమాల ప్రకారం, తాకట్టుపెట్టబడిన ఆస్తులు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత విక్రయించబడుతుంది.

తేది: డిసెంబర్ 25, 2023
ప్రదేశం: గుంటూరు

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

చీకటి పువ్వు నాటకంలో ఓ సన్నివేశం

ఆకట్టుకుంటున్న నంది నాటకాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర చలనచిత్ర టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతున్న నంది నాటకోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. రెండోరోజు ఆదివారం రెండు నాటకాలు, మూడు నాటికలు ప్రదర్శించారు. తొలిగా డాక్టర్ పి.వి.ఎన్.కష్ణ రచన దర్శకత్వంలో శ్రీ మాధవ వర్మ పద్య నాటకాన్ని, అనంతరం 'బాధ్యత' బాలల నాటిక ప్రదర్శన జరిగింది. పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో చిచ్చరపిడుగుల్లాంటి బాలలు తమ నటనా కౌశలాన్ని ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. స్వార్థంతో చెట్లను నరకడం మంచిదికాదనే సందేశాన్ని ఆముదాల సుబ్రహ్మణ్యం రచన, దర్శకత్వంలో ఆకట్టుకునేలా ప్రదర్శించారు. మూడో ప్రదర్శనగా 'కలనేత' నాటకాన్ని ప్రదర్శించారు. ఆకెళ్ల రచనకు బిఎం రెడ్డి దర్శకత్వం వహించారు. 'చీకటిపువ్వు' నాటిక చక్కని సందేశాన్ని అందించింది. చేసిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తపడిన తర్వాత కూడా అలాంటి వారిని దూరం పెట్టకూడదని సందేశాత్మకంగా నాటకం సాగింది. మూలకథ పిఎస్ నారాయణ, నాటకీకరణ, రచన, పరమాత్ముని శివరాం, దర్శకత్వం రమేష్ మంచాల వహించారు.

ఆదర్శవంత ప్రదర్శన ఉద్ధమ్ సింగ్

భరతమాత బానిస సంకెళ్లు తెంచడానికి స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో వీరులు పోరాటం చేశారు. అలాంటి వారిలో ఉరికంబాన్ని ముద్దాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్దంసింగ్ ఆదర్శ జీవితాన్ని నాటికలో చక్కగా చూపించారు. ఈ నాటికకు కథ, మాటలు, దర్శకత్వాన్నిపి.వివేక్ అందించారు.

త్రిజుడు

'త్రిజుడు' నాటికకు మూలకథ పి.వి.వి.సత్య నారాయణ, నాటకీకరణ యల్లాప్రగడ భాస్కరరావు అందించారు. వై.ఎస్.కష్ణేశ్వరరావు దర్శకత్వంలో చక్కగా ప్రదర్శితమైంది. కులం, మతం, పుట్టుక, డబ్బు ఇవేవీ మనిషి మంచితనా నికి గీటురాళ్లు కాదు. ఒక్క మానవత్వం మాత్రమే మనిషిని మనిషిగా ప్రపంచానికి చూపెడుతుందన్న సత్యాన్ని నాటిక ద్వారా ప్రేక్షకులు అందుకున్నారు.

ప్రేక్షకులను ఆకట్టుకున్న గమ్యస్తానాల వైపు

'గమ్యస్థానాల వైపు' నాటికలో సందేశం ప్రేక్షకుల హదయాలకు చక్కగా అందింది. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఎదిరించి ముందుకెళ్ళాలి. నిరాశా నిస్పహలతో జీవితాన్ని నాశనం చేసుకో కూడదు. మన ప్రాణాన్ని మనమే చంపుకుంటే అది ఆత్మహత్య అవ్వదు, హత్యగానే పరిగణించ బడుతుంది. అనే సందేశాన్ని నాటిక ఇచ్చింది.

ప్రముఖ కవి కలిదిండి వర్మ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - ఉండి (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత కలిదిండి వర్మ (47) గుండెపోటుతో శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన ఆయన చేపల మేత కంపెనీలో పని చేస్తూ భీమవరంలో స్థిరపడ్డారు. అనంతరం ఉద్యోగ నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. శనివారం రాత్రి స్నేహితులతో కలిసి టివి చూస్తుండగా గుండెపోటుతో అక్కడే కుప్పకూలి మృతి చెందారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య, కుమార్తె ఉన్నారు. వర్మ రాసిన నేను మాత్రం ఇద్దరిని, గోదారి పలకరింపు పుస్తకాలను ప్రచురితమయ్యాయి. వర్మ మృతి పట్ల సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి కె.సత్యరంజన్.. వర్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉమ్మడి విశాఖలో 5 కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, సబ్బవరం విలేకరులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆదివారం ఐదు కోవిడ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 24 మందికి పరీక్షలు చేయగా నలుగురికి కోవిడ్ నిర్ధారణ అయింది. కైలాసపురం ప్రాంతానికి చెందిన 51 ఏళ్ల మహిళ ప్రభుత్వ ఊపిరితిత్తుల ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెలో కోవిడ్ లక్షణాలు కనిపించడంతో పరీక్షలు నిర్వహించగా కోవిడ్ అని తేలింది. ప్రస్తుతం ఆమెకు ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటి వరకూ సేకరించిన నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పూణె పంపినట్లు ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. వీరికి సోకింది ఏ వేరియంట్ అనే విషయం నిర్ధారణ కావాల్సి ఉందని తెలిపారు. తాజా కేసులతో విశాఖలోని కోవిడ్ బాధితుల సంఖ్య 11కి చేరింది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం రాయపుర అగ్రహారం గ్రామంలో ఆదివారం ఓ కేసు నమోదైంది.

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది)
CIN : L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం: కెఆర్ఎం టవర్స్, 8వ అంతస్తు, హర్రింగ్‌టన్ రోడ్, చెట్‌పట్, చెన్నై-600031.
టెలీ: +91 44 4564 4000 ఫ్యాక్స్: +91 44 4564 4022.

IDFC FIRST Bank

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు

ఏదైతే, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) నుంచి దిగువ తెలిపిన రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు దిగువ తెలియపరిచిన సెక్యూర్డ్ లోన్స్‌ను తీసుకొని ఉన్నారు. రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతలు వారు వారి యొక్క ఆస్తులను తనఖా పెట్టి లోన్‌ను తీసుకున్నారు. వారు వారి యొక్క లోన్ అగ్రిమెంట ప్రకారం ఉన్న నియమాలు మరియు నిబంధనలు పాటించడంలో విఫలమైనారు మరియు వారి యొక్క లోన్‌ను ఆర్‌బిఐ గైడ్ లైన్స్ ప్రకారం ఎన్‌పిఏ లుగా వర్గీకరించబడినాయి. వారు సదరు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) బ్యాంకు వారికి బకాయి ఉన్న మొత్తంను నోటీసులో జారీ చేయబడిన విధంగా దిగువ టేబుల్‌లో వివరింపబడ్డాయి మరియు బకాయిల మీద తదుపరి వడ్డీ కూడా ఉంటుంది మరియు అదే కాంట్రాక్టువల్ రేటు ప్రకారం తెలిపిన తేదీలలో ఆమోదించబడతాయి.

క్ర. సం	లోను అకౌంట్ నెం	లోను రకం	రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల పేరు	సెక్షన్ 13(2) నోటీసు తేది	సెక్షన్ 13(2) నోటీసు ప్రకారం బకాయి మొత్తం	ఆస్తి చిరునామా
1	44613696	ఆస్తి పై రుణం	1. మోపర్తి రాజశేఖర్, 2. మోపర్తి వనజాక్షి	24.05.2023	INR 4,76,846.15/-	**అంశం-1 :** ఆంధ్రప్రదేశ్-522259, గుంటూరు జిల్లా, చెరుకుపల్లి మండలం, ప్రస్తుత చెరుకుపల్లి సబ్ రిజిస్ట్రీ అధికార పరిధిలో ఉన్న (చెరుకుపల్లి ఎస్ఆర్ఓ వద్ద రిజిస్టర్ చేయబడిన రిజి.లింక్ పార్టీషన్ డీడ్ నం.146/2019 ఆస్తి) గుడవల్లి గ్రామ పంచాయతీ యొక్క మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఎసిసి ఇంటి విస్తీర్ణం 96.67 చ.గ.లు. లేదా 80.82 చ.మీ.లు. తో బేరింగ్ డో.నం.433-15 (మూల్యాంకనం నం.1331, టాక్స్ రసీదు ప్రకారం డో.నం.1-133) మరియు **హద్దులు : తూర్పు : సర్కార్ బజార్-21 అ.లు., పడమర : సర్కార్ బజార్-21.6 అ.లు., ఉత్తరం : మోపర్తి వెంకటరావు ఇంటి సైట్-40.2 అ.లు., దక్షిణం : మోపర్తి రాజశేఖర్ ఆస్తి అంశం-2 ఇంటి సైట్-40.10 అ.లు.** ఈ సరిహద్దులు 96.67 చ.గ.లు. లేదా 80.82 చ.మీ.లు. ఇంటి సైట్ మరియు 21.6×25= 540 చ.అ.లు. ఎసిసి ఇల్లు. **అంశం-2 :** ఆంధ్రప్రదేశ్-522259, గుంటూరు జిల్లా, చెరుకుపల్లి మండలం, చెరుకుపల్లి సబ్ రిజిస్ట్రీ అధికార పరిధిలో మరియు ప్రస్తుత (చెరుకుపల్లి ఎస్ఆర్ఓ వద్ద రిజి.లింక్ పార్టీషన్ డీడ్ నం.147/2019) గుడవల్లి గ్రామ పంచాయతీ యొక్క మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఎసిసి ఇల్లు 96.67 చ.గ.లు. లేదా 80.82 చ.మీ.లు. తో బేరింగ్ డో.నం.433-15 (మూల్యాంకనం నం.1331, టాక్స్ రసీదు ప్రకారం డో.నం.1-133) మరియు **హద్దులు : తూర్పు : సర్కార్ బజార్-21 అ.లు., పడమర : సర్కార్ బజార్-21.6 అ.లు., ఉత్తరం : మోపర్తి రాజశేఖర్ ఆస్తి అంశం-1 ఇంటి సైట్-40.10 అ.లు., దక్షిణం : బాపట్ల-వెల్లటూరు హైవే రోడ్డు.** ఈ సరిహద్దుల 96.67 చ.గ.లు. లేదా 80.82 చ.మీ.లు. ఇంటి సైట్ మరియు 21.6×25=540 చ.అ.లు. ఎసిసి ఇల్లు.

మీకు తెలియజేయవలసినది ఏమనగా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) కు బకాయిలను చెల్లిచవలసిందిగా మరియు టేబుల్ లో చూపించిన దాని ప్రకారం కాంట్రాక్టువల్ రేటు ప్రకారం దాని యొక్క తేదీలతో పాటుగా ఇతర ఖర్చులు, చార్జీలు మరియు ఇతరమైనవి ఈ నోటీసు ప్రచురించిన 60 రోజులలోగా చెల్లించవలెను., ఒక వేళ మీరు గనుక చెల్లించడంలో విఫలమైనచో దిగువ సంతకాదారుడు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 14 మరియు సెక్షన్ 13(4) ప్రకారం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది) బ్యాంకు వారు వారి యొక్క ప్రక్రియ మొదలుపెడతారు. కనుక మీరు సెక్షన్ 13(13) ప్రకారం మీరు మీ యొక్క సెక్యూర్డ్ ఆస్తులను అమ్మడం/లీసు కు ఇవ్వడం గానీ లేదా ఇతర పనులు చేయడానికి మీకు అనుమతి లేదు.

సం/-
అధీకృత అధికారి
తేది: 25.12.2023
ప్రదేశం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో కలవడమైనది మరియు ప్రస్తుతం ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌గా పిలువబడుతున్నది)

అక్షరం
ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 | విజయవాడ
సోమవారం 25 డిసెంబర్ 2023

"శ్రామికులే సహజ కవులు. తమ జీవితంలోంచి, అనుభవంలోంచి పాటలను అల్లింది, కథలను కూర్చిందీ వారే! అందుకనే పూర్వ సాహిత్యంలో పౌరాణికాలూ, ప్రబంధాల కన్నా జానపద గీతాల్లోనే మనకు ప్రజా జీవితం లభ్యమవుతుంది."
- ఆరుద్ర

ఊపిరి నీవు

జ్ఞాపకంగా మిగలకూడదని
ఇంకా బతికే ఉన్నాను
వెంపర్లాటలో దొరికిన
బృహత్తర ఖేదం
ఇప్పుడు నా నిశ్వాస
జగాన్ని ప్రేమించడం
కవిత కావడం ఒక్కటి కాదు
నిబద్ధత నిర్వీర్యం కానే కాదు
నువ్వు ఒప్పుకోకున్నా,
ప్రేమించడం నిజం
నా ఊపిరి నువ్వు ..!

– వర్మ కలిదిండి

(ఈ కవి శనివారం రాత్రి బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందారు. గతనెల 24వ తేదీన తన ఫేస్‌బుక్‌లో పెట్టిన ఆఖరి కవిత ఇది.)

యుద్ధమొక నిషా

మనిషి యుద్ధానికి బానిస
నిరంతరమూ అదే ధ్యాస
వైరుధ్యమే ఆధునిక భాష
నాగరిక సమాజపు శ్వాస
విశ్వశాంతి ఓ విరోధబాస
శాంతిదూతల కంఠ శోష
బధిర లోకానికి సాగర ఘోష
యుద్ధమొక తమాషా
విజ్ఞానపు వెర్రితలల
అజ్ఞానపు దిలాసా !

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ
94408 36931

కదిలిపోవాలంతే ...

నేల పిడికిట్లోకి మేఘం విత్తే చినుకుల్లా
గుండె గుండెను అంటుకట్టుకున్న
ఊరేగింపులా
కదిలిపోవాలంతే ..!

కళ్ళం పచ్చల పసిడినెత్తే
పంటకాలువల్లా
సంద్రం దారెంట నడిచిన తడి తీరంలా
పడుతూ లేస్తూ
లేస్తూ పడుతూ మెలకువగా
ఆశల వెన్నెల దారిలో నడిచే తరంగంలా
కదిలిపోవాలంతే ..!

రుతువులా, సీతాకోకలా
కొంగుపట్టుకు తిరిగే పసి వృత్తంలా
నేలను నింగిని రెక్కలగట్టుకున్న పక్షిలా
విచ్చుకున్న నాగేటి చాళ్ల వరుసలా
కదిలిపోవాలంతే ..!

జీవితమంటే
అలసిన ఆశ కాదు
కాలం పైని రోజులన్నీ
సుఖదుఃఖపు దుమ్ము తెరల్ని దులుపుకుంటూ
గెలివిగల దరువై ప్రవహించడమే!
ఉదయంలా వచ్చి
రాత్రిలా కదిలిపోవాలి
వెలుగులా నిండి
చీకటిలా కదిలిపోవాలంతే ..
జీవితమంటే ఓ పయనమే మరి!

– ఇ.రాఘువేంద్ర
94940 74022

గుండె లోతులు కొలిచేవారు

గుండెల్లేని వాళ్ల గురించి కాదు;
చేతిలో సముద్రాన్ని దాచుకొన్న వాళ్ల గురించి
కుందేలు పిల్లల గుండెల్లోకి
తొంగిచూసిన వాళ్ల గురించి
పసికలువల కళ్ళల్లో వాడిపోతున్న
పసిడి కలల ప్రపంచాన్ని వీక్షించిన వాళ్ల గురించి
మన ఊహ స్వప్నాలు మాతృక లోంచి
ఇంటి గుమ్మంలోకి
దిగివచ్చిన చందమామలు
లయ తప్పుతున్న చిన్నారి గుండెల్లోకి
ప్రాణ వాయువులూదిన
జీవన సంగీత దర్శకులకి
పేదరికం శాపసర్పమై కాటేసిన
చిన్ని పావురాలపై
స్పర్శ సంజీవని ప్రయోగిస్తున్న వాళ్లకి
భవిష్యత్తు కేన్వాస్ పైని అసంపూర్ణ చిత్రానికి
విశ్వాసాల హీలింగ్ టచ్ యిస్తున్న వాళ్ళకి
మన దేహపు రస్తాల పైన విద్యుత్ స్పర్శతో
చిన్ని కష్ణ పాదాల ముద్రలు వేసిన వాళ్ళు
మన పిటికెడు గుండె ముద్దలో
ఆర్ద్రంగా మమతల పూల తోటల్ని నాటిన వాళ్లు
మన అనురాగాల సజీవ సాక్షులుగా
బతుకు వీధుల్లో బుడిబుడి అడుగులు వేస్తున్న వాళ్లు
రేపటి గాల్లో కలిసిపోతారంటే
బతకగలమా రెప్పపాటైన
దృశ్యం కనుపాపల్లో కదిలితే
గుండెలేని దేవుడిని
శపించాల్సిన అవసరం లేదు
దయగల దేవు ళ్లు ఎందరో మట్టిలో పుట్టాక
కరుణామృతం వర్షించే
క్రీస్తులు మనమధ్యే వున్నాక
వరాలక్కర్లేదు
పిడికెడు సానుభూతి కావాలి
స్పందించి ద్రవించే హృదయం కావాలి
ఈ నేల మీద మనిషిగా పుట్టినందుకు
సగర్వంగా తలెత్తుకు తిరిగే గౌరవం కావాలి
అందుకే మీకుచేతులెత్తినమస్కరిస్తున్నాను
గుండెల్లో గునపాలు గుచ్చే నేలలో
గుండె గాయానికి మలాము రాసే
మహాత్ములు మీరు...

– ఈతకోట సుబ్బారావు
94405 29785

సమ్మె శిబిరాల్లో సాహిత్య సృజన

సందర్భం

పాట పుట్టిందే పనీపాటల్లోంచి కాబట్టి, అనాదిగా అది కష్టజీవి పక్షమే! ఉవ్వెత్తున సాగిన ఉద్యమాల్లోంచి జనంపాట ఉద్భవించింది. ఆ పాటే పోరు నినాదమై, ఉద్యమానికి తోడు నీడై, ఆత్మ విశ్వాసమై నిలబడింది. ప్రజా ఐక్యతను చాటి చెప్పింది. స్వాతంత్ర్య ఉద్యమంలో, వామపక్ష, ప్రజా ఉద్యమాల్లో అలాంటి పాటలు ఎన్నో పుట్టాయి. జనం ఆశను, ఆకాంక్షను గట్టిగా చాటి చెప్పాయి. "మాకొద్దీ తెల్లదొరతనమూ .." అని గరిమెళ్ల గొంతెత్తి పాడినా; స్వాతంత్ర్య అనంతరం "మాకొద్దీ నల్లదొరమ"ని కుసుమ ధర్మన్న కవి ధైర్యంగా అడిగినా – ఆ పాటలను పాలకులు కంపించక తప్పలేదు. అనేకానేక నోళ్ల ఆ పాటలను పదే పదే పాడి ప్రజల ఆకాంక్షను ఆనాటి పాలకులు గ్రహించేలా గర్జించాయి.

పాటైనా, కవితైనా, మరే కళారూపం అయినా ప్రజల భావోద్వేగాల నుంచి పుట్టుకురావడం ఒక సహజమైన ప్రక్రియ. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన హక్కుల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలూ, సహాయకులూ అప్పటికప్పుడు, అక్కడికక్కడ పాటలను అల్లుకొని, రాగాలను సమకూర్చుకొని, గొంతెత్తి పాడుతున్నారు. వివిధ కళారూపాల్లో తమ ఆకాంక్షలను వెల్లడిస్తున్నారు. జానపద కళలను ఉద్యమ గీతాలతో హుషారెత్తిస్తున్నారు. హరికథ, బుర్ర కథ, కోలాటం... ఒకటేమిటి? అనేక కళలు సమ్మె శిబిరాల్లో సరికొత్త స్వరాలను సంతరించుకుంటున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో అంగన్‌వాడీ ఉద్యోగులు తప్పనిసరై విధులను బహిష్కరించి, సమ్మెకు దిగాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తాము ఏయే పనులు చేస్తున్నారో, ఎంత కష్టపడుతున్నారో వివరిస్తూ – పాటలు కూర్చి, పాడుతున్నారు. దీనికి గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటి నుంచో ప్రాచుర్యంలో ఉన్న జానపద బాణీలను ఉపయోగించి, ఇలా పదాలను అల్లుతున్నారు.

"రావనా చందనాలో ఎన్నెలా ... జగనన్నకు వందనాలో
ఏమయ్యా జగనన్నా – ఎన్నెలో ఎన్నెలా
జీతాలూ పెంచమంటే – ఎన్నెలో ఎన్నెలా
ఉలుకు పలుకు లేకుంటే – ఎన్నెలో ఎన్నెలా
ఎండలోన మేముంటే జగనన్న ..
నువ్ ఏసీలోన పడుకుంటివి జగనన్న" అంటూ విజయనగరం జిల్లా సీతానగరంలో అంగన్వాడీలు పాట కట్టి వినిపించారు. తమ కష్టాలను ఏకరువు పెడుతూ, తెలంగాణా కన్నా వెయ్యి రూపాయలు ఎక్కువే ఇస్తానన్న జగన్ హామీని గుర్తు చేస్తూ, తమ డిమాండును వినిపించారు. తాము సమ్మెలో ఉండగా, అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలను బద్దలు కొట్టడాన్ని చాలా చక్కని వాదనతో నిరసించారు.

"కరోనా టైములోన – ఎన్నెలో ఎన్నెలా
ఏ అధికారీ రాకపోయే – ఎన్నెలో ఎన్నెలా
సూపర్ వైజరు రాకపోయే – ఎన్నెలో ఎన్నెలా
పీడీ గారు రాకపోయే – ఎన్నెలో ఎన్నెలా
మేము లేని టైము చూసి – ఎన్నెలో ఎన్నెలా
తాళాలు పగలు గొడ్తిరి – ఎన్నెలో ఎన్నెలా ..." అంటూ ప్రభుత్వం తీరును సూటిగా ఎండగట్టారు. నిజమే కదా! కోవిడ్ ఉపద్రవం ముంచుకొచ్చినప్పుడు, ఎవరికి వారు భయపడి ఇళ్లల్లో దాగుండి ఉన్నప్పుడు – తమ ఊరి వారి బాగోగులు చూసు కున్నది ఎవరు? వైద్య సిబ్బందికి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చింది ఎవరు? పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు సేవలు అందించింది ఎవరు? అంగన్‌వాడీలూ, ఆశా కార్యకర్తలే కదా? ఈ విషయాన్ని పాటలో చక్కగా కూర్చి, ప్రశ్నిస్తున్నారు అంగన్వాడీలు. ప్రజల కష్టకాలంలో రానివారు ఇప్పుడు ఇలా విరుచుకుపడడం న్యాయమా? అని ప్రశ్నించారు.

అలాగే మరొక జానపద బాణీ **"అక్కా అక్కా అక్కో నీ తమ్ముళ్లొచ్చాం అక్కో .."** వరసలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శిబిరంలో పాట మార్మోగింది. అక్కడి కార్యకర్తలు ఆ పాటను కూర్చి, పాడుతూ, అంగన్వాడీ కేంద్రాలను రక్షించుకోవటానికి వాటి ద్వారా ప్రయోజనం పొందుతున్న తోటి అక్కలూ, చెల్లెళ్లూ కలిసి రావాలని కోరుతున్నారు.

గుంటూరు జిల్లా అమరావతిలో...

"అక్కా...అక్కో అక్కో అక్కో నీ చెల్లెళ్లొచ్చామక్కా
ఈ సర్కారోడు అక్కో – మా సెద్ద కానోడక్కా
మన అంగన్‌వాడీ బడినీ– ప్రైవేటోడికి అక్కా
కట్టబెట్ట జూస్తున్నడక్కా... దాన్ని అడ్డుకోవాలక్కా
బువ్వ పెట్టే బడినీ – బుద్దులు చెప్పే బడినీ
కాపాడుకోవాలక్కా – మనమైక్యం కావాలక్కా"
అంటూ మహిళా లోకాన్ని మేల్కొల్పుతున్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు, ఆ చుట్టుపక్కల మహిళలకు మధ్య ఎంతో అవినాభావ సంబంధం ఉంటుంది. అనేక సేవలు అక్కడి నుంచే వారికి అందుతాయి. అందుకనే కదా, రాష్ట్రంలో పలుచోట్ల అధికారులు కేంద్రాలను తాళాలు బద్దలు కొట్టి బలవంతంగా తెరవ బోతుంటే– స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి అడ్డుకుంటున్నారు. తమకూ, అంగన్వాడీ కార్యకర్తలకు ఉన్న బంధాన్ని చాటి చెప్పి, సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు.

13 రోజులుగా అంగన్‌వాడీ బడి మూత పడడంతో బుజ్జిగాడికి బువ్వ లేదని, ఆటపాటల్లేవని ఆవేదనతో ఒక తల్లి కోణంలో పాటను అల్లారు. ఉత్తరాంధ్ర గ్రామీణ ప్రాంతాల్లో గైరమ్మ అనే గ్రామదేవత కొలువులు తీసే సమయం ఇది. అందుకనే ఆ గైరమ్మను ఉద్దేశించి ఈ పాట సాగుతోంది.

"నోమి నోమన్నాల – తుమ్మేతో
నోమన్నలారా – తుమ్మేత
అమ్మ గైరమ్మా – తుమ్మేతో
ఆలకించాలమ్మ – తమ్మేతా
"మా అంగన్‌వాడీ బడి – తుమ్మేతో
మూత బడిపోయింది – తుమ్మేతో
మా బుజ్జిగానికి – తుమ్మేతో
బాలామృతం లేదు – తుమ్మేతా
ఆటపాటలు లేవు – తుమ్మేతో
అక్షరాలూ లేవు – తుమ్మేతా"
బాలింత...చూలింతకు – తుమ్మేతో
బలమైన తిండీ – తుమ్మేతో
పాలు గుడ్డూ లేదు – తుమ్మేతా
పప్పు అచ్చులు లేవు – తుమ్మేతా
అటుకుల్లు లేవమ్మ – తుమ్మేతా
పాలకులు కదలాలీ – తుమ్మేతో
జీతాలు పెంచాలో – తుమ్మేతా"

అంగన్వాడీ కార్యకర్తల ఆందోళనకు సంఘీభావం తెలిపే కోణంలో సాగే పాట ఇది. వారి ద్వారా పిల్లలకు ఏయే సేవలు అందుతున్నాయో ఆ పాట చక్కగా కళ్లకు కట్టేలా చెబుతోంది.

తూర్పు గోదావరి జిల్లాలోని ఒక సమ్మె శిబిరంలో కార్యకర్తలు కవులై అల్లిన మరో పాట ప్రభుత్వ వైఖరిని ఎండగడుతోంది.

"జగనన్నా సామ్రాజ్యమో – ఎన్నెలా
మనకెంతో దౌర్భాగ్యమూ – ఎన్నెలా
మన హక్కుల కోసమూ – ఎన్నెలో ఎన్నెలా
పోరాటం చేస్తుంటే – ఎన్నెలో ఎన్నెలా
బెదిరింపులు ఎన్నెన్నో – ఎన్నెలో ఎన్నెలా
అదిలింపులు ఎన్నెన్నో – ఎన్నెలో ఎన్నెలా
సాధింపులు ఎన్నున్నా ఎన్నెలా
మా పోరాటం ఆగదన్న ఎన్నెలా "

అంగన్వాడీల ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఇంతవరకూ సానుకూలంగా స్పందించలేదు. పైగా కొంతమంది అధికారులు, మంత్రులూ బెదిరింపులకు దిగుతూ మాట్లాడారు. అలాంటి ధోరణులకు తాము బెదిరేది లేదని, హక్కులు సాధించుకునే దాకా ఐక్యంగా పోరాటం సాగిస్తామని అంగన్వాడీ ఆశు కవులు నొక్కి వక్కాణిస్తున్నారు.

"ధరలేమో పెరగబట్టె – జీతాలూ పెరగవాయె
తనిఖీలు ఎక్కువయ్యె – రికార్డులు బరువాయె
అభద్రమైన బతుకు – టెన్షన్లు ఎక్కువయ్యె" అంటూ తమ వాస్తవ కష్టాలనూ వివరించారు.

అలాగే, అంగన్వాడీల సమ్మెకు ప్రజల నుంచి మద్దతు గట్టిగానే లభిస్తోంది. దీనిని ప్రతిబింబిస్తూ ఐద్వా నాయకురాలు గౌరి అల్లిన పాట బుడిబుడి నడకల అంగన్‌వాడీ పిల్లాడిని కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది.

"మా ఆయమ్మ నాకూ తుమ్మేతో
బువ్వ తినిపించింది తుమ్మేత
మూతి తుడిసిందమ్మ తుమ్మేత
ముద్దీ కడిగిందమ్మ తుమ్మేత
నేను జల్లిన ఎంగిల్ని తుమ్మేతో
ఆయమ్మ తుడిసింది తుమ్మేతా"
....
"మా టీచరమ్మా తుమ్మేతో
పాట నేర్పిందీ తుమ్మేతా
బొమ్మలు చూపింది తుమ్మేతో
ఆట ఆడించింది తుమ్మేతా
బాగా తినమందీ తుమ్మేతో
బలంగా అవ్వమంది తుమ్మేతా.."

ఈ పాట కూడా అమ్మ తరువాత అమ్మలా అంగన్‌వాడీ ఆయమ్మలు, టీచరమ్మలూ పిల్లలకు చేస్తున్న సేవలను చక్కగా వివరిస్తోంది.

"వందనాలమ్మా నీకూ వందనాలమ్మా" అనే సినిమా పాట ఇప్పుడు అంగన్‌వాడీల గొంతులో ఉద్యమ గీతంగా మారింది. ఈ పాట వింటే జగనన్న గుండె కరగక మానదా అనిపించేలా కార్యకర్తలు సున్నితంగా శ్రావ్యంగా ఆలపించారు.

"అడుగుతున్నామూ జగనన్నా....
అడుగుతున్నామూ
మా తోడు – నువ్వుంటవనూకున్నాం
మా దారి – నీదేనని అనూకున్నాం
మోసపోయామూ జగనన్నా...
మోసపోయామూ
ఆదుకుంటావనుకున్నాం జగనన్నా...
చేరదీస్తావనుకున్నాం
నిత్యవసర ధరలూ... జగనన్నా
పెంచుతూ పోయావ్ జగనన్నా
మాకిచ్చే జీతంతో ఓ జగనన్నా
ఒక పూట తిని చూడు ఓ జగనన్నా
రోడ్ల పాలయ్యాం జగనన్నా
మేమూ అప్పుల్లో ఉన్నాం
అమలు చేయన్నా
కనీస జీతం అమలు చేయన్నా
మారాలి అన్నా .. నీ మనసూ మారాలి అన్నా " అంటూ ఈ పాట సాగింది. అంతే కాదు; ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని, అలాకాక బెదిరిస్తే బెదిరేది లేదని ఆఖరున తేల్చి చెప్పారు.

"నీ బెదిరింపులకు... జగనన్నా... బెదిరేది లేదు
సిఐటియు జెండ – మాకూ అండగుండగ
హక్కులు సాధించ కదులుతామన్నా" అని స్పష్టం చేశారు.

"ఊc అంటావా మావా ఊcఊc అంటావా ..." అన్న పాట కూడా ఇప్పుడు పోరు పాటైపోయింది. ఈ పాట విని గుంటూరు సమ్మె శిబిరంలో నవ్వుల పువ్వులు విరబూశాయి. ఏ తాళమైనా మా రాగం కలిపేస్తాం.. పోరు పాటగా మార్చేస్తాం అంటూ అంగన్‌వాడీలు ఉత్సాహంగా సమ్మె శిబిరంలో నవ్వులు పూయించారు.

ఊc అంటావా జగను –
ఊcఊc అంటావా జగను
నువ్వు ఊcఊc అంటే గనక మేము
ఉగ్రరూపం దాల్చుతాం జగను
టిక్కు టిక్కు టిక్కూ మంటూ ఇన్నాళ్లు బటన్ నొక్కేవ్
ఇకపై టైం మాది ఇవిఎం బటన్ మేం నొక్కుతాం" అని ఈ పాటలో హెచ్చరించారు.

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు సమ్మె శిబిరంలో **'జగన్ గోవిందా... గోవిందా'** బాణీలో పాట కూర్చి పాడారు. గుంటూరు జిల్లాలో సమ్మెకు మద్దతుగా అంగన్వాడీలు, కేంద్రాలకొచ్చే పిల్లల తల్లులు కోలాటం ప్రదర్శించారు. పల్నాడు జిల్లా అమరావతిలో 'భద్రాచలం' సినిమాలోని ఒకటే జననం.. ఒకటే మరణం పాటకు కోలాటం ఆడారు.

అంగన్వాడీల సమస్యలు, విన్నపాలు, నినాదాలే పాటలుగా మారుతున్నాయి. ఈ కళారూపాలకు అన్నిటికీ కవులు వారే. సంగీత, నృత్య దర్శకులూ వారే. వారి పాటకు కాగితం, కలం అక్కర్లేదు. "నువ్వో పదం, నేనో పదం కలిపి పాట కట్టేద్దాం." అన్నట్టు అవలీలగా పాటలు కూర్చి, గానం చేస్తున్నారు.

పాటైనా, కవితైనా, ఇతరత్రా ఏ కళారూపమైనా ప్రజల నుంచే పుడతతాయి. ప్రజల ఆశల, ఆకాంక్షల కేతనాలై రెపరెపలాడతాయి. ఇప్పుడు అంగన్వాడీ సమ్మె శిబిరాలను పరికిస్తే – ఆ దృశ్యమే కనిపిస్తోంది. పోరాటానికి పాట ఏ విధంగా ఆయుధమవుతుందో, ఏవిధంగా ఆసరాగా నిలుస్తుందో తెలుస్తోంది. ఈ పోరాటానికి కవులూ రచయితలూ కళాకారులూ కూడా తమ కలాల ద్వారా, గళాల ద్వారా సంఘీభావం తెలపటం చాలా అవసరం.

– ఎల్.శాంతి
76800 86787

పాట ఒక ఆయుధం ..

పనీ పాటా అనే రెండూ జంటగా ఉంటాయి. పది మంది కలిసి పనిచేస్తున్నప్పుడు, పదిమంది ఒకే ప్రయోజనం కోసం పాటు పడుతున్నప్పుడూ – 'పాట' దానికదే పుట్టుకొస్తుంది. పదిమంది కలిసి నడవడమే 'ఆట'గా పరిణమిస్తుంది. పాట... హాయిగా అలరించి, ఆనందాన్ని ఇవ్వగలదు. బిగిసిన పిడికిలై పెను నిద్దుర వదిలించనూ గలదు. ప్రజాకాంక్ష గెలిచిన చోట అది ఆనంద తాండవవుతుంది. అన్యాయం తలెత్తిన చోట అగ్గిరవ్వై రగులుతుంది.

'జజ్జనకరి జనారే జనకు జనా జనారె... జజ్జనకరె జజ్జనకరె జజ్జనకరె జనారే...' అన్న రాగం భూసామి గుండెను దడదడ లాడిస్తే ... "బండెనక బండి గట్టీ... పదహారు బళ్లు గట్టీ... ఏ బండ్లో పోతవు కొడకో" అన్న గానం నైజాము నవాబును దౌడు తీయించింది. "హైలెస్సో.. హైలెస్సా... హైలెస్సో.. హైలెస్సా" అన్న హుషారు రాగం శ్రమజీవి కష్టాన్ని మైమరపించింది.

చేను చెక్కిన శిల్పం సోమేపల్లి

ఒక జర్నలిస్టుగా, ఒక కవిగా, ఒక అధికారిగా, ఒక రైతుబిడ్డగా, ఒక సమాజ శ్రేయోభిలాషిగా తనదైన ముద్ర వేసి, వెళ్లిపోయారు సోమేపల్లి వెంకటసుబ్బయ్య. ప్రకాశం జిల్లా గన్నవరంలో సోమేపల్లి హనుమంతరావు, నాగరత్నం దంపతులకు పుట్టాయన. కామర్స్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. ఒక క్రమంలో జీవితంలో ఎదిగారు. వారి శ్రీమతి విజయలక్ష్మిని కూడా అన్నింట ముందుంచుతూ వెన్ను తట్టి ప్రోత్సహించారు. వారి ఇద్దరు పిల్లలు వశిష్ట, విశ్వనాథ విరించి తమ రంగాల్లో ముందుకు వెడుతున్నారు. సోమేపల్లి మొట్టమొదట ఆంధ్రజ్యోతిలో జర్నలిస్టుగా పనిచేశారు. జర్నలిస్టుగా రాణిస్తూనే గ్రూప్–2 పరీక్షలకు హాజరై, అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులై ఎమ్మార్వోగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఎమ్మార్వోగా, ఆర్డీవోగా, జడ్పీ సీఈవోగా, పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా నెరవేర్చారు. ఓ పక్క ఉద్యోగ బాధ్యతలని విజయవంతంగా నిర్వహిస్తూనే ప్రవృత్తిగా సాహితీ సేవ కొనసాగించారు.

గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా అనేక కవి సమ్మేళనాలు, కథల పోటీలు, పుస్తకావిష్కరణలు నిర్వహించారు. సాహిత్య రంగంలో విశిష్ట సేవలందించే ఎంతోమంది రచయితలకు సోమేపల్లి పురస్కారాలు అందించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘాన్ని కూడా స్థాపించి, సహస్ర కవి సమ్మేళనాలు నిర్వహించారు. ఒకవైపు సామాజిక చైతన్యాన్ని ఆవిష్కరిస్తూనే మరోపక్క జీవన విలువల్ని తెలియజేసే తదేక గీతం, తొలకరి చినుకులు, పచ్చని వెన్నెల, లోయలో మనిషి, రెప్పల చప్పుడు, చల్లకవ్వం, నాగలికి నా నమస్కారం, చేను చెక్కిన శిల్పాలు.... లాంటి కవితా సంపుటాలను వెలువరించారు. రైతు ఇంట జన్మించిన ఆయన... రైతన్నల ఈతి బాధలను, వారిలోని కషి, పట్టుదలను కవితా పాదాలుగా మలచి సాహితీ పూతోటలో అందంగా విరబూయించారు. ఆయన రైతుబిడ్డ, రైతు కవి. నిజంగానే చేను చెక్కిన శిల్పం.

ఈ ఉద్యోగ కర్తవ్యాలు విజయవంతంగా నిర్వమించి, గవర్నర్ చేతుల మీదుగా మూడుసార్లు రెడ్‌క్రాస్ ప్రశంసా పత్రాలు, కలెక్టర్ చేతుల మీదుగా అనేక అవార్డులు అందుకున్నారు. సాహితీ రంగంలో చేసిన సేవలకు సోమిరెడ్డి జమునా పురస్కారం, ఆంధ్ర సారస్వత సమితి పురస్కారం, జన రంజక కవి ప్రతిభా పురస్కారం, అమరావతి సాహితీ మిత్రుల ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆయన కుమారుడు వశిష్ట కూడా కవిత్వం రాస్తూ, ఆయన వారసత్వాన్ని, ఇష్టాన్ని కొనసాగిస్తున్నారు. ఎంతో ప్రేమగా, అభిమానంగా కవులను, రచయితలను ఆదరించే వెంకట సుబ్బయ్య భౌతికంగా దూరం కావటం సాహిత్యరంగానికి తీరని వెలితి. వారికి అక్షర నివాళి.

– పింగళి భాగ్యలక్ష్మి,
97047 25609

కొలకలూరి పురస్కారాలు -2024

కొలకలూరి సాహిత్య పురస్కారాలకు ఈ సంవత్సరం కూడా మూడు ప్రక్రియా గ్రంథాలకు మూడు పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించాం. ఈ పురస్కారాలకు తెలుగు సాహిత్య స్రష్టలు ప్రపంచంలో ఎక్కడున్నా అర్హులు. 1. కొలకలూరి భాగీరథి పురస్కారం–2024 – కథానిక – రూ.15 వేలు; 2. కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం 2024 – నవల రూ.15 వేలు; 3. కొలకలూరి రామయ్య పురస్కారం – 2024 – విమర్శనం – రూ.15 వేలు. ఆయా ప్రక్రియల్లో 2022 జనవరి 1 తరువాత ప్రచురితమైన గ్రంథాలు నాలుగేసి ప్రతులు పంపాలి. రచయితలైనా, ప్రచురణకర్తలైనా తమ గ్రంథాలను ఈ దిగువ చిరునామాలకు 15.1.2024 లోగా పంపాలి. పురస్కార ప్రకటన 15.2.2024న వెలువడుతుంది. 26.2.24న హైదరాబాదులో జరిగే సభలో పురస్కారం ప్రదానం జరుగుతుంది. ఒక్క రచయిత ఒక ప్రక్రియలో ఒక గ్రంథమే పంపాలి.

చిరునామాలు : 1. కథానికా సంకలనాలు/ నవలలు : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, (సెల్ 94419 23172); తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి – 517 502. 2. విమర్శన గ్రంథాలు : ఆచార్య కొలకలూరి సుమకిరణ్, (సెల్: 99635 64664), ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి – 517 502. ఆం.ప్ర.

సముద్రం అంశంపై కథల పోటీ

విశాలాక్షి సాహిత్య మాసపత్రిక శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారకంగా సముద్రం అంశంపై కథల పోటీ నిర్వహిస్తూ ఈ కథలతో ప్రత్యేక కథాసంపుటి వెలువరిస్తుంది. ప్రథమ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు 5 వేలు, ద్వితీయ బహుమతి ఐదు కథలకు రూ.3 వేలు, తృతీయ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.2 వేలు వంతున ప్రదానం చేస్తారు. సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథలకు వెయ్యి రూపాయలు చొప్పున బహుమతి ఉంటుంది. సముద్రం చుట్టూ అలలు అలలుగా ఎన్నో సమస్యలు. ఏ అంశం అయినా కథా వస్తువుగా స్వీకరించ వచ్చు. జనవరి 20 లోపు విశాలాక్షి సాహిత్య మాసపత్రిక, 27–5–487 పద్మావతి నగర్, బాలాజీ నగర్ ఎక్స్‌టెన్షన్, నెల్లూరు 524002, ఫోన్. 9440529785 కు పంపాలి.

అలాగే, కథ, కవితలు, బాలల కథలకు సంబంధించి మరొక పోటీ కూడా నిర్వహిస్తున్నాం. కథలలో 5 వేలు, 4 వేలు, 3 వేలు నగదు బహుమతులు ఉంటాయి. నాలుగో బహుమతి కింద 8 కథలకు ఒక్కో కథకు రూ.1000 చొప్పున అందిస్తాం. బాలల కథలు, కవితలకు కూడా రూ.1000, 750, 500 చొప్పున వేర్వేరుగా బహుమతులు ఉంటాయి. డిసెంబర్ 31 లోపు విశాలాక్షి సాహిత్య మాస పత్రిక, 27/5/487 పద్మావతి నగర్ బాలాజీనగర్, నెల్లూరు 524004కు రచనలు పంపాలి.

– ఈతకోట సుబ్బారావు, 94405 29785

డా. వినోదినికి ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం

ఈ ఏడాది ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారానికి ప్రముఖ కవయిత్రి డా. వినోదిని మాదాసు (యోగివేమన విశ్వవిద్యాలయం) ఎంపికయ్యారు. ఈ పురస్కారం కింద రూ.20 వేల నగదు, జ్ఞాపికను అందచేస్తారు. 31.12.2023 ఆదివారం ఉదయం 10 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కేంద్రం సింగిల్ విండో హాల్లో జరిగే సభలో పురస్కార ప్రదానం జరుగుతుంది. ఈ సభకు ముఖ్యఅతిథిగా డా. చింతకింది కాసీం హాజరవుతారు.

– ఎదిరెపల్లి కాశన్న, 96400 06304

వేమన పద్య పోటీలు

తెలుగు భాషా, సమాజాల వికాసానికి జీవం పోసిన వేమన శతక పద్యాలపై వంద విద్యాసంస్థల్లో పోటీలను నిర్వహించతలపెట్టాం. ఆయా పాఠశాలలకు ప్రశంసాపత్రాలు, వేమన పుస్తకాలు, పతకాలను అందచేస్తాము. ఆసక్తి ఉన్న విద్యాసంస్థలు 99639 17187 నెంబర్‌ను సంప్రదించి ఈనెల 26వ తేదీలోగా నమోదు చేసుకోగలరు.

– వేమన పౌండేషన్, అనంతపురం

కవిసంధ్య కవితల పోటీ - 2024

మార్చి 21, ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా సుధామ గారి 'ఓసారి చూడండి ... అంతే' (వాట్సప్ ప్రసార సంచిక); 'గంధకుటి' సౌజన్యంతో వచన కవితల పోటీ నిర్వహిస్తున్నాం. విజేతలకు ప్రథమ బహుమతి : రూ.3000, ద్వితీయ బహుమతి : రూ.2000; తృతీయ బహుమతి రూ.1000; ప్రోత్సాహక బహుమతులు 5 కవితలకు ఒక్కొక్క కవితకు రూ.500 చొప్పున అందిస్తాం. కవిత రెండు రాత పేజీలకు మించకుండా వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేదిగా ఉండాలి. కవితలను 31 జనవరి 2024లోగా పోస్టు ద్వారా మాత్రమే పంపాలి. బహుమతులు మార్చి 21వ తేదీన జరిగే ప్రపంచ కవితా దినోత్సవ సదస్సులో ప్రదానం చేయబడతాయి. కవితలు పంపాల్సిన చిరునామా : దాట్ల దేవదానం రాజు, కన్వీనర్, కవితల పోటీ, జిక్రయనగర్, యానాం (పోస్ట్), పిన్ :533464, వయా : కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా– ఆంధ్రప్రదేశ్. ఫోన్: 94401 05987.

– గంధకుటి, కవిసంధ్య

ప్రతి మహిళకూ సాధికారత కల్పించాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ : భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రతి మహిళకూ సాధికారత కల్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే లక్ష్యాన్ని సాధించటం దేశంలోని ప్రతి మహిళ బలం, స్వావలంబన, సాధికారతపై ఆధారపడి ఉన్నదని ఆమె తెలిపారు. అణగారిన వర్గాలను, ముఖ్యంగా మహిళలను ఉద్ధరించడంలో స్వయం సహాయక సంఘాల పాత్రను కూడా ఆమె నొక్కి చెప్పారు. జైసల్మేర్‌లో జరిగిన లఖపతి దీదీ సదస్సులో ప్రసంగిస్తూ ఆమె ఈ విధంగా అన్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ 'లఖపతి దీదీ' పథకాన్ని ప్రకటించారు. ఇందులో రెండు కోట్ల మంది మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం ఈ పథకం లక్ష్యంగా ఉంది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు నక్సలైట్లు మృతి

దంతెవాడ : ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు మరణించారు. జిల్లాలోని కటేకళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దబ్బకున్న గ్రామం సమీపంలోని ఒక పర్వత ప్రాంతం వద్ద సాయంత్రం 5:30 గంటలకు ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజిపి పి సుందర్‌రాజ్ తెలిపారు. ఈ ప్రాంతంలో నక్సలైట్లు కోసం పోలీసులు గాలింపు చేపడుతుండగా, నక్సలైట్లు కాల్పులు జరిపారని, దీంతో సిబ్బంది కూడా ఎదురుకాల్పులు జరిపారని చెప్పారు. ఈ సంఘటనా స్థలం నుంచి కొన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

జైల్లోనే ఇమ్రాన్ ఖాన్

- తోషఖానా కేసులో బెయిల్ పిటిషన్ తిరస్కృతి

ఇస్లామాబాద్ : తోషఖానా అవినీతి కేసులో దోషిగా నిర్ధారించడాన్ని కొట్టివేయాలని కోరుతూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పెట్టుకున్న పిటిషన్‌ను పాకిస్తాన్ సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌తో పాటూ జత చేయాల్సిన పత్రాలు అవసరమైనవి లేవని పేర్కొంటూ తిరిగి జనవరి 6న అప్పీల్ చేసుకునేందుకు అవకాశమిచ్చింది. అంతవరకు ఖాన్ జైల్లోనే వుంటారు. ఇస్లామాబాద్ హైకోర్టు ఈ నెల 11న ఇలాంటి విజ్ఞప్తినే తిరస్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఖాన్ రాజ్యాంగంలోని 185వ అధికరణ కింద సవాలు చేశారు. దానిపై సుప్రీం రిజిస్ట్రార్ కార్యాలయం స్పందిస్తూ ఆ అప్పీల్‌ను వెనక్కి తిప్పి పంపించింది. ప్రభుత్వ బహుమతులను అక్రమంగా విక్రయించారన్న ఆరోపణలపై ఇస్లామాబాద్ హైకోర్టు అదనపు సెషన్స్ జడ్జి ఆగస్టు 5న ఖాన్‌ను దోషిగా నిర్ధారించారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఖాన్ తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌లో అవసరమైన అంశాలు లేవని, అందువల్లే తిరస్కరిస్తున్నామని తెలిపారు.

నకిలీల నడుమ ప్రజాస్వామ్యం

- ఫేక్ వార్తలు, క్లెయిమ్‌లతో తప్పుడు సమాచారం
- మోడీ పాలనలో అర్థం మారిన డెమోక్రసీ
- ప్రజలపై ప్రభుత్వానిది చిన్న చూపు
- సామాజిక కార్యకర్తలు, మేధావుల ఆందోళన

ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పబడుతున్నది. 140 కోట్ల మంది ప్రజలున్న ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి అర్థం మారిపోతున్నది. కల్పిత వార్తలు, తప్పుడు ప్రకటనలు, ప్రచారాలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ముఖ్యంగా, కేంద్రంలోని మోడీ పాలనలో అసలైన ప్రజాస్వామ్యానికి అర్థం మారిపోయి తప్పుడు మార్గంలో ప్రయాణిస్తున్నదని సామాజిక కార్యకర్తలు మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలనలో ప్రజలను చిన్న చూపు చూస్తున్న విధానమే ఇందుకు నిదర్శనమని వారు అంటున్నారు.

న్యూఢిల్లీ : మోడీ పాలనలో ప్రజా, పత్రికా స్వేచ్ఛ హరించుకుపోయిందనీ, పలు దేశీయ, విదేశీ సంస్థల నివేదికలు సైతం వెల్లడిస్తున్నాయన్నాయి. ప్రజాస్వామ్యమంటే తమ పాలనేననీ, గత ప్రభుత్వాల కంటే తమ ప్రభుత్వంలోనే ఇది వెలుగొందుతున్నదని మోడీ సర్కారు చెప్పుకుంటున్నది. అయితే, ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయమే ప్రధానమనీ, కానీ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇవేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నదని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇందుకు వారు అనేక సందర్భాలనున గుర్తు చేస్తున్నారు.

కేవలం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఎన్నికల్లో రాజకీయంగా లబ్ది పొందాలని మోడీ సర్కారు అనేక అడ్డదారుల్లో ప్రయాణిస్తున్నదనీ, ప్రజాస్వామ్య దేశానికి ఇదేమీ మంచి పరిణామం కాదని విశ్లేషకులు అంటున్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' అంటూ మహిళా సాధికారత విషయంలో మాటలు చెప్పే మోడీ ప్రభుత్వం.. చేతల్లో దానిని విస్మరిస్తున్నదని చెప్తున్నారు. దేశంలో మహిళా రెజ్లర్ల ఆందోళనలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు అంటున్నారు.

వార్తలు, లోతైన ఫేక్ న్యూస్, క్లెయిమ్‌లు, కౌంటర్ క్లెయిమ్‌లు వంటి గందరగోళం మధ్య, నకిలీ, నిజమైన ప్రజాస్వామ్యాల మధ్య తేడాను గుర్తించడం చాలా కష్టంగా మారుతున్నదని సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్షాలు, పత్రికలు, మేధావులు, విమర్శకుల పాత్ర చాలా కీలకం. అయితే, బీజేపీ పాలనలో మాత్రం వారికి తగిన స్థానం దక్కటం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశం అభివృద్ధి చెందాలంటే ప్రశ్నించటమే ప్రధానమనీ, అలా ప్రశ్నించిన వారి గొంతు నొక్కితే అది ఆ దేశానికే ప్రమాదమని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో పెద్ద ఎత్తున ఎంపీల సస్పెండ్‌ను వారు ఉటంకిస్తున్నారు.

ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను సామాజిక మాధ్యమాల్లో 'బఫూన్లు'గా చేసి చూపిస్తూ బీజేపీ సోషల్ మీడియా విభాగం, దాని అనుబంధ వార్త ఛానెళ్లు ఆనందం పొందుతున్నాయనీ, ఇలా చేస్తే బీజేపీకి తాత్కాలికంగా ఉపశమనం కలిగించవచ్చేమో కానీ కోట్లాది మంది ప్రజలున్న భారతదేశానికి ఇది చాలా ప్రమాదకరమని మేధావులు అంటున్నారు. ప్రజాస్వామ్యమన్న పదం చాలా విలువైనదనీ, దానిని ప్రతి ఒక్క చోటా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని చెప్తున్నారు.

ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంపై మోడీ సర్కారు ఏకపక్ష తీరు కూడా ఆందోళన కలిగిస్తున్నదని అంటున్నారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో విమర్శలు, పోస్టులు చేస్తే కొందరు అరెస్టు అయిన విషయాన్ని సామాజిక కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. మోడీ సర్కారు ఇజ్రాయెల్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవటమే ఇందుకు కారణమనీ, ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే భారత్‌లో ఇదేరకమైన వ్యవహారమని మేధావులు ప్రశ్నిస్తున్నారు. బీజేపీ సర్కారు తన నిర్ణయాన్ని సమర్థించుకోవటంలో భాగంగా తన ఐటీ సెల్ విభాగంతో సోషల్ మీడియాలో విరివిగా నకిలీ వార్తలు, కథనాలు, పోస్టులతో ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నదనీ, మోడీ సర్కారు నిర్ణయాలేవైనా సాహసోపేతమైనవంటూ కట్టుకథలు రాసుకొస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు.

సామాజిక మాధ్యమాలను దూరం పెట్టడం మొదలైంది!

- అసత్యాలు, విశృంఖలత్వమే కారణం
- 2025 నాటికి 50 శాతం మంది గుడ్‌బై చెప్పే అవకాశం
- గార్ట్‌నర్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమాలు జనజీవితాలపై ఎంతటి ప్రభావం చూపుతున్నాయో తెలిసిందే. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలకు జనం ప్రత్యేకించి యువతరం హత్తుకుపోతున్నారు. అయితే, స్వేచ్ఛ అధికంగా ఉండే ఈ సామాజిక మాధ్యమానికి వినియోగదారులు దూరమవడం మొదలైందని తాజాగా ఒక సర్వేలో వెల్లడయ్యింది. స్వేచ్ఛ పేరిట విశృంఖలత్వం, అసభ్యతతో పాటు ఎన్నికలను, ప్రజాభిప్రాయాలను ప్రభావితం చేసేలా తప్పుడు కథనాలు, అసత్యాలు హద్దే లేకుండా వ్యాప్తి అవుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాను వదిలించుకోవడం మొదలైందని ఆ సర్వేలో తేలింది. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం, విషపూరితమైన వినియోగదారు స్థావరాలు, బాట్‌ల ప్రాబల్యం కారణంగా 50 శాతం కంటే ఎక్కువ మంది వినియోగదారులు 2025 నాటికి సోషల్ మీడియాతో తమ

పరస్పర చర్యలను పూర్తిగా వదులుకోవటం లేదా గణనీయంగా తగ్గించుకొని కొన్నింటికే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గార్ట్‌నర్ తన సర్వేలో వెల్లడించింది. సర్వే సమాచారం ప్రకారం.. 53 శాతం మంది వినియోగదారులు గత సంవత్సరం లేదా ఐదేండ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుత సోషల్ మీడియా స్థితి క్షీణించిందని నమ్ముతున్నారు. "డిజిటల్ మార్కెటింగ్ కోసం సోషల్ మీడియా టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ఛానెల్‌గా ఉన్నది. అయితే వినియోగదారులు తమ వినియోగాన్ని పరిమితం చేయటానికి చురుకుగా ప్రయత్నిస్తున్నారు" అని గార్ట్‌నర్ మార్కెటింగ్ ప్రాక్టీస్‌లో సీనియర్ ప్రిన్సిపల్ రీసెర్చర్ ఎమిలీ వీస్ అన్నారు.

29న కేరళ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ

తిరువనంతపురం : కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ ఈ నెల 29న జరగనుంది. ఇద్దరు నూతన మంత్రులు ఈ నెల 29న ప్రమాణస్వీకారం చేయనున్నారని, ముఖ్యమంత్రి పినరయి విజయన్ వారి పోర్టుఫోలియోలను నిర్ణయించనున్నారని ఎల్‌డిఎఫ్ కన్వీనర్ ఇపి జయరాజన్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం తరువాత ఆయన మాట్లాడుతూ 2012లో రెండోసారి విజయన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో నాలుగు మిత్రపార్టీలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు రెండున్నర సంవత్సరాల కాల పరిమితితో మంత్రి పదవి అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇద్దరు మంత్రుల కాల పరిమితి ఈ ఏడాది నవంబర్‌లోనే పూర్తయిందని, అయితే 'నవకేరళ సదస్సు' కారణంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఆలస్యమయిందని తెలిపారు. ప్రస్తుత మంత్రులు డెమోక్రటిక్ కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆంటోని రాజు, ఇండియన్ నేషనల్ లీగ్ ఎమ్మెల్యే అహ్మద్ దేవర కోవిల్ స్థానంలో కేరళ కాంగ్రెస్(బి) ఎమ్మెల్యే కెబి గణేష్ కుమార్, కాంగ్రెస్ (ఎస్) ఎమ్మెల్యే కాదనపల్లి రామచంద్రన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారని జయరాజన్ చెప్పారు. ఆంటోని రాజు, అహ్మద్ దేవర కోవిల్ ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి విజయన్‌కు రాజీనామా లేఖలు సమర్పించినట్లు తెలిపారు.

కాల్పుల విరమణ కోరలేదు

- వెల్లడించిన బైడెన్
- నెతన్యాహుతో సుదీర్ఘంగా ఫోన్‌లో చర్చలు

గాజా : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు గాజాలో సాగుతున్న మిలటరీ ఆపరేషన్ లక్ష్యాలు, వాటి తీరుతెన్నులపై చర్చించారు. ఇరువురు నేతలు టెలిఫోన్‌లో సుదీర్ఘంగా సంభాషించుకున్నారు. గాజాలో కాల్పుల విరమణ గురించి తాను నెతన్యాహును అడగలేదని బైడెన్ చెప్పారు. శనివారం నెతన్యాహుతో జరిపిన సుదీర్ఘ సంభాషణను ప్రైవేట్ సంభాషణ అని తేల్చేశారు. ఈ సంభాషణలో కాల్పుల విరమణ ప్రస్తావనే రాలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. తర్వాత వైట్‌హౌస్ దీనిపై ఒక ప్రకటన విడుదలజేసింది. గాజాలోని పౌరులను కాపాడాల్సిన అవసరాన్ని బైడెన్ నొక్కి చెప్పారని ఆ ప్రకటన పేర్కొంది. అలాగే మిగిలిన బందీలను సురక్షితంగా విడుదల చేయాల్సిన అవసరం వుందన్నారు. గాజాలో తక్షణమే సాయాన్ని పెంచాల్సిన అవసరం వుందని కోరుతూ భద్రతామండలి తీర్మానాన్ని ఆమోదించిన నేపథ్యంలో ఇరువురు నేతలు చర్చించారు. ఐక్యరాజ్య సమితిలో అమెరికా తీసుకున్న వైఖరిని నెతన్యాహు ఈ సందర్భంగా అభినందించారు. హమాస్‌ను నాశనం చేసేవరకు యుద్ధం ఆపేది లేదని నెతన్యాహు ఎప్పటిలానే హూంకరించారు.

గాజాపై బాంబు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 76 మంది మృతి

గాజాపై ఇజ్రాయిల్ శనివారం జరిపిన బాంబు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన 76 మంది చనిపోయారు. గత 24గంటల్లో మొత్తంగా 200మందికి పైగా మరణించారు. రఫా ప్రాంతంలో ఓ గృహ సముదాయంపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించడంతో ఒకే కుటుంబానికి చెందిన 76 మంది, అదే గృహ సముదాయంలో నివసిస్తున్న 16 మంది బంధువులు చనిపోయారు. వీరిలో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి నిధిలో సీనియర్ ఉద్యోగి ఇస్సామ్ అల్ ముఖ్రాబీ కూడా ఉన్నారు. గాజా పౌరులకు సహాయం అందించేందుకు కృషి చేస్తున్న ఐరాస, రెడ్‌క్రాస్ సంస్థల సిబ్బందిపైన ఇజ్రాయిల్ నిరంతరం దాడులు చేస్తోంది. అక్టోబరు7 న ప్రారంభమైన ఇజ్రాయిల్ హంతక దాడుల్లో ఇంతవరకు 20 వేల మందికిపైగా పాలస్తీనియన్లు చనిపోయారు.

రెడ్‌సీలో రణరంగం

- సముద్రంలో కార్గో నౌకలపై హౌతీ దాడులు
- డ్రోన్లు, క్షిపణుల ప్రయోగం
- అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం
- పెరగనున్న చమురు, నిత్యావసరాల ధరలు
- భారత్‌లోనూ ఆందోళన

జెరూసలేం : ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ జ్వాలలు ఇప్పుడు సముద్రానికీ వ్యాపించాయి. సముద్రం ఇప్పుడు అనేక దేశాలకు యుద్ధ భూమిగా మారింది. హమాస్‌కు మద్దతు ఇస్తున్న హౌతీ రెబల్స్ ఇజ్రాయిల్ వెళుతున్న లేదా ఆ దేశంతో సంబంధం ఉన్న నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ సమాజంలో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి.

ఇజ్రాయిల్, హమాస్ మధ్య అక్టోబర్ 7న యుద్ధం ప్రారంభమైంది. ఇజ్రాయిల్‌లో ప్రవేశించిన హమాస్ వందలాది మందిని హతమార్చి 200 మందికి పైగా ప్రజలను బందీలను చేసింది. దీంతో హమాస్ ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా ఇజ్రాయిల్ గాజా, గాజా స్ట్రిప్‌పై భీకర పోరు ప్రారంభించి పాలస్తీనియా ప్రజలను పెద్ద సంఖ్యలో పొట్టనపెట్టుకుంటోంది. ఈ యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అదే సమయంలో ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తున్న హౌతీ రెబల్స్ కూడా ఆ దేశానికి చెందిన నౌకలపై దాడులు చేస్తున్నారు. వీరు ఎర్ర సముద్రం, అరేబియా సముద్రం మీదుగా వెళుతున్న అనేక నౌకలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్లు, క్షిపణులతో దాడి చేస్తున్నారు. కొన్ని నౌకలను దోచుకుంటున్నారు. గడచిన నెల రోజుల వ్యవధిలోనే హౌతీ రెబల్స్ 12 సార్లకు పైగా వాణిజ్య నౌకలపై దాడులు చేశారు.

జరిగిన దాడులు ఇవే

గత నెల 19న హౌతీ రెబల్స్ బ్రిటన్‌కు చెందిన కార్గో నౌక 'గలాక్సీ లీడర్'పై దాడి చేసి దానిని స్వాధీనం చేసుకున్నారు. సముద్రం మధ్యలో ప్రయాణిస్తున్న నౌకపై సినీ ఫక్కీలో హెలికాప్టర్‌ను దింపి సిబ్బందిని బందీలుగా పట్టుకున్నారు. ఈ నెల 3న ఇజ్రాయిల్‌కు చెందిన రెండు నౌకలపై దాడి చేశారు. 12వ తేదీన నార్వే ట్యాంకర్‌పై క్షిపణితో దాడి చేశారు. ఈ దాడిలో ట్యాంకర్‌కు నిప్పంటుకున్నప్పటికీ ఎవరూ గాయపడలేదు. 13వ తేదీన బాబ్ అల్ మాన్‌దేబ్ జలసంధిలో మన దేశానికి చెందిన కార్గో నౌకపై రెండు క్షిపణులను ప్రయోగించారు. అయితే అదృష్టవశాత్తూ ఆ దాడి నుండి భారత నౌక తప్పించుకోగలిగింది. ఈ నెల 22న శుక్రవారం నాడు అరేబియా సముద్రంలో ఓ నౌకపై దాడి జరిగింది. గుజరాత్‌లోని వెరావల్‌కు నైరుతి దిశలో 200 కిలోమీటర్ల దూరంలో ఈ దాడి జరిగింది. దాడి అనంతరం నౌకలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అయితే మంటలను సకాలంలో ఆర్పివేశారు. సౌదీ అరేబియా ఓడరేవు నుండి ఈ నౌక మంగళూరు వస్తుండగా ఈ ఘటన జరిగింది. శనివారం దక్షిణ ఎర్ర సముద్రంలోని అంతర్జాతీయ నౌకా ప్రయాణ మార్గాలపై హౌతీ రెబల్స్ నౌకా విధ్వంసక బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడులలో జరిగిన నష్టం వివరాలు ఇంకా అందలేదు.

ధరలు పెరిగే అవకాశం

ముడి చమురు, ఇతర నిత్యావసర వస్తువులతో సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలను లక్ష్యంగా చేసుకొని హౌతీ రెబల్స్ దాడులు సాగిస్తున్నారు. ఈ దాడులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో చమురు ధరలు మాత్రమే కాకుండా నిత్యావసరాల ధరలు కూడా భగ్గుమనే అవకాశం ఉంది. ఈ దాడుల కారణంగా తన వ్యాపారానికి విఘాతం కలగవచ్చునన్న ఆందోళన భారత్‌లో కూడా కన్పిస్తోంది. హౌతీ రెబల్స్ దాడులపై ప్రధాని మోడీ ఇటీవలే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో మాట్లాడారు. సముద్ర మార్గంలో భద్రతపై వారిద్దరూ పరస్పరం ఆందోళనను పంచుకున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా ఈ దాడులు ఆగిపోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ సరఫరాలకు ఆటంకం

హౌతీ దాడుల కారణంగా సముద్ర మార్గంలో జరుగుతున్న అంతర్జాతీయ వాణిజ్యం బాగా దెబ్బతింది. ఎందుకంటే ఎర్ర సముద్రం మీదుగానే వ్యాపార కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతుంటాయి. పశ్చిమాసియా మాత్రమే కాకుండా అరేబియా, యూరప్, ఆఫ్రికా, భారత్ కూడా సముద్ర మార్గం ద్వారానే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. హౌతీ రెబల్స్ దాడుల కారణంగా అంతర్జాతీయ సరఫరాలకు ఆటంకం కలుగుతోంది. దాని ప్రభావం ఇప్పటికే కన్పిస్తోంది. దాడుల నేపథ్యంలో ప్రపంచంలోని అతి పెద్ద కార్గో కంపెనీలు ఇకపై ఎర్ర సముద్రం ద్వారా తమ సరకు రవాణా నౌకలను పంపడానికి ఇష్టపడవు. ఆ కంపెనీలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటాయి. అయితే దీనివల్ల దూరం పెరుగుతుంది. ఫలితంగా ఖర్చు కూడా పెరుగుతుంది. వ్యయం పెరిగితే దాని ప్రభావం ఈరోజు కాకపోయినా రేపైనా ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. చివరికి ఆ భారాన్ని మోయాల్సింది వినియోగదారులే.

ఎర్ర సముద్రమే ఎందుకు?

హౌతీ రెబల్స్ తమ దాడులకు ఎర్ర సముద్రాన్నే ఎందుకు ఎంచుకుంటున్నారు? ప్రపంచ వాణిజ్యంలో 12% ఈ సముద్రం మీదుగానే జరుగుతోంది. ఈ మార్గం ద్వారా ప్రతి సంవత్సరం 10 బిలియన్ డాలర్ల కంటే అధిక విలువ కలిగిన సరుకులు ఎగుమతి లేదా దిగుమతి అవుతున్నాయి. దీనిని బట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎర్ర సముద్రానికి ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో అర్థమవుతుంది. హౌతీ రెబల్స్ ఈ మార్గాన్ని ఎంచుకోవడానికి మరో కారణం కూడా ఉంది. ఈ దాడుల వల్ల అంతర్జాతీయ సమాజంలో అలజడి మొదలవుతుందని, హమాస్‌పై యుద్ధానికి స్వస్తి చెప్పవలసిందిగా ప్రపంచ దేశాలు ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచుతాయని వారు భావిస్తున్నారు.

ఆ నౌక భారత్‌ది కాదు...గబాన్‌ది

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన ఇరవై ఐదు మంది సిబ్బందితో ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న ముడి చమురు ట్యాంకర్ డ్రోన్ దాడికి గురైంది. హౌతీ రెబల్స్ ఈ డ్రోన్‌ను ప్రయోగించారని అమెరికా సైన్యం చెబుతోంది. దాడి జరిగిన తర్వాత ట్యాంకర్ నుండి అదే ప్రాంతంలో ఉన్న అమెరికా యుద్ధ నౌకకు సందేశం వెళ్లింది. పశ్చిమ ఆఫ్రికాలోని గబాన్ దేశానికి చెందిన ఈ నౌక పేరు 'ఎంవీ సాయిబాబా'. డ్రోన్ దాడిలో ఎవరూ గాయపడలేదని, నౌకలోని 25 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని భారత నౌకాదళ అధికారులు ధృవీకరించారు. నౌకపై భారత్ పతాకం ఉన్నదని తొలుత వార్తలు వచ్చాయి. అయితే అది గబాన్‌కు చెందిన నౌక అని, భారతీయ షిప్పింగ్ రిజిస్టర్ నుండి సర్టిఫికేషన్ పొందిందని నౌకాదళం వివరణ ఇచ్చింది.

పౌర హత్యలపై సిపిఎం పొలిట్‌బ్యూరో ఖండన

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఆర్మీ కస్టడీలో ఉన్న ముగ్గురు పౌరులను చిత్రహింసలు పెట్టి దారుణంగా చంపడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. మహమ్మద్ షౌకత్, సఫీర్ హుస్సేన్, షబ్బీర్ అహ్మద్‌లను సైనిక సిబ్బంది తమ అదుపులోకి తీసుకుని, వారిని తీవ్రంగా హింసించి, వేధించారని, ఫలితంగా వారు మరణించారని పొలిట్‌బ్యూరో తెలిపింది. బాధిత కుటుంబాలకు జమ్మూ కాశ్మీర్ పాలనా యంత్రాంగం నష్టపరిహారాన్ని ప్రకటించింది. కానీ, అది సరిపోదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ ఘటనపై సత్వరమే విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిని శిక్షించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఎంతటి దారుణానికి పాల్పడినా శిక్ష పడకుండా తప్పించుకునే రక్షణను సాయుధబలగాలకు కల్పించడం వల్ల చాలా కాలంగా అకృత్యాలకు గురవుతున్న జమ్మూ కాశ్మీర్ ప్రజలు ఈ ఉదంతంలోనైనా జవాబుదారీని నిర్ధారిస్తారని, న్యాయం జరిగేలా చూస్తారని ఆశిస్తున్నారని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ఇవిఎంలపై మళ్లీ చర్చ

- మూడు రాష్ట్రాల్లో ఊహించని ఫలితాలపై ఆశ్చర్యం

న్యూఢిల్లీ : ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)ల అంశం మళ్లీ చర్చకు వచ్చింది. పలు సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధంగా వచ్చిన ఈ ఫలితాలు సర్వత్రా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ముఖ్యంగా, రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెస్‌కు ఇది షాక్‌ను కలిగించింది. 'ఇండియా' ఫోరంలోని పలు పార్టీలు కూడా ఇవిఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేసింది.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఈనెల 7న వెలువడ్డాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. బిజెపి విజయం సాధించింది. ఇక మధ్యప్రదేశ్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున సీట్లను గెలిచి కాషాయ పార్టీ అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకున్నది. వాస్తవానికి ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలకు సంబంధించి పలు వార్త సంస్థలు, సర్వే ఏజెన్సీలు ఎగ్జిట్ పోల్ ఫలితాలను విడుదల చేశాయి. పలు సంస్థలు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనీ, తెలంగాణలో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుందని అంచనా వేశాయి. అలాగే, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో టఫ్ ఫైట్ ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు ఉంటాయని చెప్పాయి.

అయితే, డిసెంబర్ 7న వెలువడిన ఫలితాల్లో మాత్రం ఇది పూర్తి విరుద్ధంగా మారింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో విస్పష్టమైన మెజారిటీతో బీజెపి అధికారంలోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాని కూలదోసి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నది. అయినప్పటికీ.. ఫలితాల్లో ఇది ప్రతిబింబించకపోవటం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఊహించనీ రీతిలో కాషాయ పార్టీ సీట్లను గెలుచుకొని అధికారాన్ని సొంతం చేసుకోవటంపై కాంగ్రెస్‌తో పాటు 'ఇండియా' ఫోరంలోని పలు పార్టీలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి.

ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ ఇవే ఆరోపణలు చేశారు. తమ ఓటమికి కారణం ఇవిఎంలేనని చెప్పారు. దీంతో ఇవిఎంలపై చర్చ మళ్లీ మొదటికొచ్చినట్టయ్యింది. ఇవిఎం అనేది ఒక పరికరమనీ, దానిని ట్యాంపరింగ్, హ్యాకింగ్ చేయవచ్చని కొందరు నిపుణులు అంటున్నారు. అలాగే, కావాల్సిన విధంగా ప్రోగ్రామింగ్ చేసుకునే అవకాశాలనూ కొట్టిపారేయలేమని చెప్తున్నారు. ఇలాంటి అనుమానాల నేపథ్యంలో కాంగ్రెస్ మాత్రం బ్యాలెట్ పోరుకు డిమాండ్ చేస్తున్నది. మరికొన్ని పార్టీలైతే వివిప్యాట్‌లను వంద శాతం లెక్కించాలనీ, లేదనకుంటే వాటిని ఓటరుకు ఇచ్చి బ్యాలెట్ బాక్స్‌లో వేసే విధంగా సిస్టమ్‌ను మార్చాలని చెప్తున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల పరిగణలోకి తీసుకొని ఎన్నికల సంఘం ఈ విషయంలో వేగంగా స్పందించి అందుకు అనుగుణంగా మార్పులు తీసుకురావాలని కాంగ్రెస్ సహా పలు పార్టీలు కోరుతున్నాయి.

నైగర్ నుంచి చివరి ఫ్రెంచ్ సైనికుడి నిష్క్రమణ

- రాయబార కార్యాలయం మూసివేత

నియామే: నైగర్ కొత్త ప్రభుత్వం ఇచ్చిన అల్టిమేటమ్ మేరకు ఆ గడ్డ మీది నుంచి తమ దళాలను ఫ్రెంచ్ ప్రభుత్వం పూర్తిగా వెనక్కి తీసుకుంది. గత చాలా కాలంగా తిష్టవేసుక్కూచొన్న 1500 మంది తన సైనికుల్లో ఆఖరి 50 మంది ఫ్రెంచ్ సైనికులు శనివారం నిష్క్రమించారు. దీంతో నైగర్ నుంచి ఫ్రెంచ్ సైన్యాల ఉపసంహరణ ప్రక్రియ ముగిసినట్లైంది. చివరి ఫ్రెంచ్ దళాలు నైగర్ నుంచి నిష్క్రమించడానికి కొన్ని గంటల ముందు నియామెలోని తన రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. దళాల ఉపసంహరణకు సంబంధించిన ఒక ఉమ్మడి ప్రకటనపై నైగర్ సైనికాధిపతి మమనే సాని కియావు, ఫ్రెంచ్ సైనిక ప్రతినిధి ఎరిక్ ఓజాన్ శుక్రవారం సంతకాలు చేశారు. నైగర్ సైన్యం విడుదల జేసిన పత్రికా ప్రటకన ప్రకారం సైనిక ఉపసంహరణ అంతా నిర్దిష్ట కాల ప్రణాళిక ప్రకారమే జరిగింది. అక్టోబరు 10న ఫ్రెంచ్ సైనికుల మొదటి కాన్వాయ్ ఉపసంహరణ జరిగింది. జులై 26న నైగర్‌లో సైనిక తిరుగుబాటు ద్వారా అధ్యక్షుడు మొహమ్మద్ బజౌమ్‌ను నిర్బంధించి, అధికారం చేజిక్కించుకున్న ఆ దేశ ప్రెసిడెన్షియల్ గార్డు మాజీ చీఫ్ అబ్దురహమనే ట్చియాని ఫ్రెంచ్ దళాలను దేశం వీడి వెళ్లిపోవాలని ఆదేశించారు. దీంతో ఫ్రాన్స్, నైగర్ మధ్య సంబంధాలు పేకమేడలా ఒక్కసారి కుప్పకూలాయి. నైగర్ వాసులకు ఫ్రాన్స్ వీసాలను నిలిపివేసింది. నైగర్ సైనిక ప్రభుత్వం అల్టిమేటమ్ ఇవ్వడంతో 2023 చివరి నాటికి సైనిక దళాలను ఉపసంహరించుకుంటామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ ప్రకటించారు.

సాయుధుల కాల్పుల్లో రిటైర్డ్ పోలీస్ అధికారి మృతి

శ్రీనగర్ : గుర్తు తెలియని సాయుధులు జరిపిన కాల్పుల్లో మసీదులో ప్రార్థనలు చేసుకుంటున్న రిటైర్డ్ పోలీస్ అధికారి మరణించిన ఘటన జమ్ముకాశ్మీర్ సంభవించింది. బారాముల్లాలో ఆదివారం జరిగిన ఈ ఘటనలో తీవ్రగాయాలలతో రిటైర్డ్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మొహమ్మద్ షఫీ అక్కడిక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పూంచ్ జిల్లాలో సైనికుల వాహనంపై ఉగ్రవాదులు దాడి ఘటన జరిగిన మూడు రోజుల అనంతరం ఈ హత్య ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

నట్టనడి సంద్రంలో చిక్కుకుపోయిన రోహింగ్యాలు

- కాపాడాలంటూ యుఎన్‌హెచ్‌సిఆర్ విజ్ఞప్తి

ఢాకా : దాదాపు 200 మంది రోహింగ్యా శరణార్థులు ప్రయాణిస్తున్న బోటు ఇంజన్ విఫలమవడంతో హిందూ మహా సముద్రంలో చిక్కుకుపోయిన వారిలో భయాందోళనలు పెరుగుతున్నాయి. ఆ బోటులోని ప్రయాణికుడు ఒకరు మరణించడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. మరింతమంది చనిపోయే ప్రమాదముందని, ఇప్పటికే డజన్ల సంఖ్యలో ప్రయాణికుల పరిస్థితి ఆందోళనకరంగా వుందని ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషనర్ (యుఎన్‌హెచ్‌సిఆర్) హెచ్చరించింది. బోటులో 185 మంది రోహింగ్యాలు, ఇతర సిబ్బంది వున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలే. అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో బోటు విఫలమవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. బంగ్లాదేశ్‌లో కిక్కిరిసిపోయిన శరణార్థ శిబిరాల నుండి రోహింగ్యాలు పారిపోతున్నారు. తమ మాతృభూమి మయన్మార్ నుండి వచ్చేసి ఇక్కడ వారు ఆశ్రయం పొందారు. ముస్లిం మైనారిటీలపై మిలటరీ అణచివేత చర్యలకు పాల్పడడంతో 2017లో వీరు మయన్మార్ నుండి పారిపోయారు. నడి సముద్రంలో చిక్కుకుపోయిన వారిని సకాలంలో కాపాడకపోతే, సమీపంలోని సురక్షితమైన ప్రాంతానికి చేర్చకపోయినట్లైతే అనేక తీర ప్రాంత దేశాలు చూస్తుండగానే వారిలో అనేకమంది చనిపోతారని యుఎన్‌హెచ్‌సిఆర్ హెచ్చరించింది. నిజంగా ఇది దారుణమైన పరిస్థితని వ్యాఖ్యానించింది. మయన్మార్‌లో తమపై జరుగుతున్న వేధింపులు భరించలేక వేలాదిమంది రోహింగ్యాలు ముప్పుతో కూడిన సముద్ర ప్రయాణాలు చేస్తూ, ఇతర ప్రాంతాలకు ప్రధానంగా మలేసియా లేదా ఇండోనేషియాలకు తరలిపోతున్నారు. గతేడాది 2వేల మందికి పైగా రోహింగ్యాలు ఇలాగే ప్రయాణించారు. ఇలా ప్రయాణించే వారిలో గతేడాది నుండి 570మందికి పైగా మరణించారు. ఈ స్థాయిలో మానవ విపత్తులు జరగకుండా నివారించేందుకు ఈ ప్రాంతంలోని దేశాలు తక్షణమే పూర్తి స్థాయిలో సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం వుందని యుఎన్ హెచ్‌సిఆర్ స్పష్టం చేసింది.

నరాలు తెగిపోతున్న బాధను పంటిబిగువున బిగబట్టి, అణువణువు కంపించిపోతున్న వేదనను అనుభవించి అమ్మ బిడ్డకు జన్మనిస్తుంది. రక్తమాంసాలను క్షీరధారలుగా చేసి బిడ్డ ఆకలి తీరుస్తుంది. ఈ రెండు సందర్భాల గురించి తలచుకున్నప్పడల్లా మహిళలపట్ల ఎంతో గౌరవం, మరెంతో ఉదారత కనబరుస్తుంది సమాజం. అదే మహిళ రుతుక్రమంలో ఉందంటే మాత్రం ఆమె పట్ల చిన్నచూపు ప్రదర్శిస్తుంది. ఆ బాధను చెప్పకుంటే ఆమెను తక్కువ చేసి మాట్లాడుతుంది. సరిగ్గా ఇప్పుడు అలాగే జరిగింది. పెద్దల సభ సాక్షిగా ఆమెకు అవమానం జరిగింది. రుతుక్రమంలో ఉన్న మహిళకు విశ్రాంతి ఇవ్వడం వైకల్యంతో ముడిపెట్టారు. సమానత్వ సాధనలో ఉన్న మహిళ పట్ల ఇది వివక్షకు దారితీస్తుందని సుద్దులు చెప్పారు. ఇంత హేళన ఎందుకు?

జ్ఞాపకాలు

బంగారు బాలల్లారా!
'పులి' అరుపులు విందామా
'నెమలి' నాట్యం చూద్దామా
'ఏనుగు'పై ఎక్కుదామా
'మర్రి చెట్టు'లో దాక్కుందామా

'హాకీ' ఆట ఆడుదామా
'మామిడి పండు' తిందామా
'డాల్ఫిన్'తో ఆటలాడుదామా
'రూపాయి' దాచుకుందామా

'వందేమాతరం' విందామా
'తామర పువ్వు' కోద్దామా

'జనగణమన' పాడుదామా
'తిరంగా'ను ఎగిరేద్దామా

- బోనగిరి. పాండురంగ,
తొర్రూరు.

గజిబిజి

పిల్లలూ, శాంటాక్లాజ్ బొమ్మలో ఉండాల్సిన భాగాలు పక్కనే ఉన్న బాక్సులో గజిబిజిగా ఉన్నాయి. వాటికి ఇచ్చిన అంకెల ఆధారంగా ఏ భాగం ఎక్కడ ఉండాలో రాయండి.

నేను గీసిన బొమ్మ



దేవులపల్లి శ్రీ వర్ష,
నంగునూర్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విశ్రాంతి కోరడం వివక్షకు ఎలా దారి తీస్తుంది?

రుతుక్రమంలో విశ్రాంతి కోరితే ఆమెను శక్తిహీనురాలిలా చూడాలా? రుతుక్రమంలో ఉన్నప్పుడే.. ఆమె కొండలను పిండి చేసే శక్తిని ప్రదర్శిస్తోంది. పర్వత శిఖరాలు అధిరోహిస్తోంది. క్రీడామైదానాల్లో పరుగులు తీస్తోంది. పతకాలు సాధిస్తోంది. వంటగదిలో విరామం లేకుండా శ్రమిస్తోంది. ఆఫీసులో విసుగులేకుండా పనిచేస్తోంది. ప్రసవ వేదనను ఎంతలా అనుభవిస్తుందో రుతుక్రమంలో కూడా ఆమెకు అదే బాధ, అదే వేదన. కత్తితో పొడిచి మెలిపెట్టి తిప్పినంత కష్టం. కంటివెంట కన్నీళ్లు రావుగాని, ఆ క్షణం ఒళ్లంతా నీరైన నిస్సత్తువ ఆవహిస్తుంది. ఇంతటి బాధలో కూడా చిరునవ్వులు చిందిస్తూ తన వల్ల ఏ అసౌకర్యం రాకుండా జాగ్రత్త పడుతుంది. 'ఆ సమయంలో విశ్రాంతి తీసుకుంటే ఎంతో బాగుంటుంది. కానీ ఆ అవకాశం లేద'ని వాపోయేవారెందరో.. ఉన్నత విద్యావంతులు, ఉన్నత కొలువుల్లో స్థిరపడ్డవారు, శ్రామిక మహిళ, కార్మిక స్త్రీ ఇలా ఏ రంగంలో పనిచేస్తున్నా ఆ రోజుల్లో కాస్తంత విశ్రాంతి కోరుకుంటుంది ఆమె.

సమాజంలో మార్పు రావాలి

'విశ్రాంతి గురించి ఆలోచించే ముందు, రుతుక్రమం చుట్టూ ఉన్న అపోహలు తొలగిపోవాలి. సమాజంలో ఆ దిశగా మార్పు రావాల'ని న్యాయశాస్త్ర ప్రొఫెసర్, రచయిత సమీనా దల్వాయి, తనకెదురైన అనుభవాలను ఇలా వివరించారు. 'నేను షాపుకెళ్లి శానిటరీ ప్యాడ్లను అడిగినప్పుడు, షాపు యజమాని ఓ న్యూస్‌పేపరులో చుట్టి, నల్ల కవరులో పెట్టి ఇస్తాడు. ఒకసారి అలా వద్దని నేరుగా తీసుకుంటే చాలా ఇబ్బందిగా ముఖం పెట్టి ఇచ్చాడు. అది తీసుకుని బజారులో నడుస్తున్నప్పుడు, నా చేతిలో ఉన్న ఇతర మందుల కవర్లు, బాత్‌రూమ్ క్లీనర్లు ఎన్ని ఉన్నా అందరిచూపు ఆ శానిటరీ ప్యాడ్ మీదే ఉంది. వారంతా చాలా అసౌకర్యంగా ఉండడం నాకు తెలుస్తోంది' అంటూ చెప్పారు. ఈ అనుభవం సమీనాది మాత్రమే కాదు.. ఎందరిదో..

మార్పు రావాలి

ఈ తరంలోనైనా కాస్త మార్పు తేవాలని నా వంతు ప్రయత్నాలు చేస్తున్నాను. ఇప్పుడు నా విద్యార్థులు, తమ స్నేహితులను బహిరంగంగా శానిటరీ ప్యాడ్లు అడుగుతారు. అప్పుడు, ఆ బృందంలో ఉన్న మగ విద్యార్థులెవరూ తమ కనుబొమ్మలెగరేయరు. పైగా రుతుక్రమంలో ఉన్న వారికి అవసరమైన వస్తువులు తెచ్చిపెడతారు. తమ స్నేహితుల ఇబ్బందులను అర్థం చేసుకుని పెయిన్‌కిల్లర్ టాబ్లెట్లు, ఉపశమనం కోసం వాడే ఇతర బామ్‌లు వంటివి తెస్తుంటారు' అని సమీనా అంటున్నారు.

భయంతో ఉంటారు

'రుతుక్రమంలో ఉన్నప్పుడు మరకల భయంతో చాలామంది ముదురురంగు బట్టలు ధరించడం నాకు తెలుసు. తలుపు వెనకాల నుంచొని మాట్లాడేవారి గురించి విన్నాను. ఆమెను ముట్టుకోకూడదని, ఆమె ముట్టుకుంటే ఊరగాయ పాడైపోతుందని, ఇల్లంతా అపవిత్రమౌతుందని భావించే వారెందరో ఈ సమాజంలో ఉన్నారు. ఉన్నత స్థాయిలో స్థిరపడ్డవారు, విద్యావంతులు కూడా ఇదే ధోరణిలో ఉండిపోతున్నారు. రుతుక్రమంలో ఉన్నప్పుడు ఆమె పట్ల చూపించే వివక్ష అంతాఇంతా కాదు.

విశ్రాంతి ఎందుకంటే..

రుతుక్రమం చుట్టూ ఉన్న ఈ అపోహలు మాసిపోనంతవరకు, ఆ రోజుల్లో విశ్రాంతి ఎందుకో ఎవరికీ అర్థం కాదు. 'రుతుక్రమంలో ఉన్నప్పుడు 1, 2 రోజులే బాధ ఉంటుంది. అదీ అందరికీ ఒకలా ఉండదు. ఈ మాత్రం దానికి విశ్రాంతి ఎందుక'ని పెద్దల సభలో మహిళా మంత్రి స్మృతి ఇరానీ వ్యాఖ్యానించినప్పుడు ఆమెకు మద్దతుగా కొన్ని గొంతుకలు తోడయ్యాయి. అయితే ఆ 1, 2 రోజుల బాధను భరించలేక ఇటీవల అమెరికాలో ఓ విద్యార్థిని పెయిన్‌కిల్లర్ టాబ్లెట్లు వేసుకుని మృతి చెందింది. ఎంత బాధ ఉంటే ఆమె ఆ పనిచేసింది. ఆ బాధ ఆమె ఒక్కదానిదే కాదు. ఎంతో మందిది. 2015లో గ్లోబల్ జర్నల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సర్వే ప్రకారం ... భారతీయ విద్యార్థుల్లో 70.2 శాతం మంది రుతుస్రావ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా నెలలో రెండు రోజులు తరగతులకు హాజరు కావడం లేదు. వీరిలో తీవ్రమైన బాధ అనుభవించేవారు 23 శాతం మంది ఉన్నారు. వారు, 3 రోజులు ఆ బాధను భరించారు. మరో రెండు రోజులు కూడా చాలా అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపారు. ఒక్కసారి పీరియడ్ నొప్పి మొదలైతే, మంచం మీద నుండి కూడా లేవలేని వారు ఎంతోమంది. సరిగ్గా భోజనం చేయలేరు. అతిసారంతో బాధపడతారు. వాంతులతో ఇబ్బంది పడతారు. అలసట, వెన్నునొప్పి, నీరసం, తలనొప్పి, కండరాల నొప్పులు వంటివన్నీ ఒక్కసారిగా చుట్టుముడతాయి.

ఎక్కడో ఏ మూలో యుద్ధాలు, వరదలు, తుఫానులు, అల్లర్లు, అణుబాంబుల దాడుల్లో చనిపోతున్న వాళ్లని తలచుకుని బాధపడతాం. ఆ అభాగ్యుల పట్ల ఉదారత చూపిస్తాం. మహిళల పట్ల ఎక్కడ, ఏ అన్యాయం జరిగినా మానవత్వ హృదయాలెన్నో కలవరపడిపోతాయి. మరి ఇక్కడెందుకు ఆ భావన చూపించలేకపోతున్నాం. విశ్రాంతి కోరడం, వివక్షకు ఎలా దారితీస్తుంది? ఇది సమానత్వమో.. సాధికారతో.. మరేదో.. ఇంకేదో.. కాదు. ఇది ఒక సున్నితమైన అంశం. భావోద్వేగభరితం. అనాదిగా అదే లోపించింది. రుతుక్రమం చుట్టూ ఎన్నో అపోహలు, మరెన్నో నిశ్శబ్ద యుద్ధాలు.. ఆ పర్యవసానమే ప్రస్తుత వ్యాఖ్యలు.

ఏకపక్ష నిర్ణయం ఆమోదం కాదు

మాతృస్వామ్య వ్యవస్థలో ఆమె ఏ స్థితిలో ఉన్నా విశ్రాంతి లేకుండా పనిచేసింది. పోరాడింది. కానీ ఇప్పుడు కాలం మారింది. ఆమెకు విశ్రాంతి ఇవ్వాలన్న ఆలోచన ఫలితంగా వేతనంతో కూడిన మాతృత్వపు సెలవులు, అనారోగ్య సెలవులను ప్రభుత్వాలు, గుర్తింపు పొందిన ప్రభుత్వేతర సంస్థలు మంజూరు చేస్తున్నాయి.

కానీ రుతక్రమ సెలవులపై ఆవిధమైన భావన కొరవడింది. స్మృతి ఇరానీ వంటి వారు విశ్రాంతి తీసుకోవడాన్ని వైకల్యంతో ముడిపెట్టడం మహిళల పట్ల పెద్ద అవమానం. మాతృత్వం సెలవులు ఇస్తున్నప్పుడు దాన్ని అంగవైకల్యంగా ఎవరూ భావించరు. జాతి వృద్ధికి ఆమె మూలకారణమని ఎంతో గౌరవిస్తారు. సమాజానికి అదొక అవసరమైన ప్రక్రియగా అనుకుంటారు. అదేవిధంగా పీరియడ్‌లో ఉన్న వారిపట్ల కూడా ఆలోచించాలి. అదొక సహజ ప్రక్రియగా భావించాలి. రుతుక్రమం చుట్టూ ఉన్న అపోహలు తొలగిపోయి, శాస్త్రీయ ఆలోచనలు రావాలి. ఈ అంశంపై మహిళలతో, వైద్యులతో చర్చలు జరపాలి. ఏకపక్షంగా తిరస్కరించడం ఆమోదం కాదు. మహిళలను గౌరవిస్తాం అని చెబుతూనే వాళ్లకు సంబంధించిన ఏ చిన్న అంశంలోనైనా వాళ్లని ఘోరంగా అవమానించడం, అగౌరపర్చడం ఈ పాలకులకు అలవాటైన పద్ధతి. ఈ అంశంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. సముచిత నిర్ణయం వైపు అడుగులు వేయాలి.

- డి.రమాదేవి,
ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రంగవల్లి

పి.హెచ్ బిందు,
దుర్గాపురం,
విజయవాడ.

11 నుండి 7 చుక్కలు
(మధ్య చుక్క)



ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@ gmail.com
వాట్సాప్ : 83329 25496

చిన్న సినిమాలకూ ఆదరణ

తెలుగు చిత్ర పరిశ్రమలో ఈ ఏడాది కొన్ని చిన్న సినిమాలు హిట్ టాక్‌ను అందుకోగా, మరికొన్ని బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టాయి. ఇంకొన్ని ఊహించని రీతిలో విజయదుందుభిని మోగించాయి. 2023లో కొత్తగా పరిశ్రమలోకి ఎందరో హీరోలు, హీరోయిన్లు, నిర్మాతలు, దర్శకులు వచ్చారు. పెద్ద హీరోలతో పోటీ పడుతూ వచ్చిన సినిమాలు సైతం ప్రేక్షకుల ఆదరణను చూరగొన్నాయి. ఏడాది మొదట్లో పెద్ద సినిమాల హవానే నడిచినా చిన్న సినిమాలు సైతం కొంతమేరకు పోటీనిచ్చాయి. సంతోష్ శోభన్ 'కళ్యాణం కమనీయం', సుధీర్‌బాబు 'హంట్' పెద్దగా ప్రేక్షకాదరణ పొందలేకపోయాయి. ఫిబ్రవరిలో 'రైటర్ పద్మనాభం' ప్రేక్షకాదరణ పొందింది. సుహాస్ హీరోగా నటించిన ఈ సినిమా కామెడీతో సాగటంతో ఫ్యామిలీ ఆడియన్స్ ఆదరించారు. చాయ్ బిస్కెట్, మేమ్ ఫేమస్ యువతను ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత వచ్చిన బుట్టబొమ్మ, వినరో భాగ్యం, మిస్టర్ కింగ్ పెద్దగా ఆదరణకు నోచుకోలేదు.

మార్చిలో జబర్దస్త్ ఫేం కమెడియన్ వేణు దర్శకుడిగా తీసిన సినిమా 'బలగం' హిట్‌మూవీగా నిలిచింది. చిన్న సినిమాకు కొత్త అర్థం చెప్పింది. మానవ సంబంధాలను, స్థానికతనూ మేళవించి, ప్రజాదరణ పొందింది. అనేక స్థాయిల్లో అవార్డులనూ సొంతం చేసుకొంది. ఏప్రిల్, మే నెలల్లో వచ్చిన చిన్న సినిమాల్లో 'అన్నీ మంచి శకునములే..' కాస్తా పాజిటివ్ టాక్‌ను అందుకుంది. జూన్‌లో శ్రీ విష్ణు రూపొందించిన 'సామజవరగమన' కామెడీకి పెద్దపీట వేసి, విజయాన్ని సొంతం చేసుకుంది. అప్పటికే నష్టాలబాటలో ఉన్న నిర్మాత అనిల్ సుంకర ఈ సినిమాతో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డారనేది టాక్. జులైలో వచ్చిన 'బేబి' పెద్ద విజయాన్నే నమోదు చేసుకుంది. ఈ ఏడాది చిన్న సినిమాల్లో ఇదే పెద్ద హిట్‌గా నిలిచింది.

ప్రముఖ యూట్యూబర్ వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా ఆనంద్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన చిత్రం ఇది. సాయి రాజేష్ దర్శకత్వం వహించారు. అక్టోబర్‌లో వచ్చిన మ్యాడ్ సరికొత్త రికార్డునే సొంతం చేసుకుంది. జూనియర్ ఎన్‌టిఆర్ బామ్మర్ది నార్ని నితిన్ కీలకపాత్రలో నటించారు. కాలేజ్‌లో విద్యార్థుల వ్యవహార శైలిపై ఇందులో చాలా సరదాగా చూపించారు. ఈ సినిమా కూడా అతి తక్కువ బడ్జెట్‌తో విడుదలైనా మంచి లాభాలను గడించినట్టు నిర్మాతలు ప్రకటించారు. ముగ్గురు స్నేహితుల పేర్లతో చేసిన ప్రయోగం, పాటలు సరికొత్తగా రావటంతో సామాజిక మాధ్యమాల్లోనూ బాగా ప్రచారం పొందింది. సంపూర్ణేష్‌బాబు 'మార్టిన్ లూథర్‌కింగ్ కూడా ప్రేక్షకాదరణ పొందింది. నవంబర్‌లో తరుణ్ భాస్కర్ రూపొందించిన 'కీడా కోలా' కూడా సరికొత్తగా సాగింది. పొలిమేర 2 కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. చాలాకాలం తర్వాత శ్రీకాంత్ చేసిన కోటబొమ్మాళి పీఎస్' కూడా బాగానే ఆడింది. ఇందులోని లింగిడి పాట సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున హల్‌చల్ చేసింది. డిసెంబర్‌లో కొన్ని సినిమాలు వచ్చినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. యాంకర్ సుమ తనయుడు రోషన్ 'బబుల్ గమ్' సినిమా ఈనెల 29న విడుదల కానుంది. ఓవరాల్‌గా చూస్తే ఈ ఏడాదిలో బలగం, సామజవరగమన, బేబీ, మ్యాడ్ తమ సత్తా చాటాయి. కార్తికేయ 2తో హిట్ కొట్టిన నిఖిల్ స్పై సినిమా ఫ్లాప్ కావటంతో డీలా పడ్డారు.

మూఢ నమ్మకాలను పెంచేలా...

జులైలో వచ్చిన స్లమ్ డాగ్ హస్బెండ్ సినిమాలో మూఢనమ్మకాలను పెంచేలా దర్శకుడు శ్రీధర్ చూపించారు. బ్రహ్మాజీ తనయుడు సంజయ్‌రావు, ప్రణవి మానుకొండ ఇందులో నటించారు. జాతకంలో దోషం పోవాలంటే లచ్చి (హీరో)కు కుక్కతో పెళ్లి జరిపించాలని పూజారి చెప్పటంతో ఆ తరహాలో చేస్తారు. ఆ తర్వాత నిజం పెళ్లి నటీనటులకు చేస్తారు. సాంకేతికంగా ఇంత అభివృద్ధి చెందినా నేటికీ మూఢ నమ్మకాలను చూపించే ప్రయత్నంతో ఆడియన్స్‌కు వినోదం కంటే ఇబ్బందిగా ఫీలయ్యారు. మా ఊరి పొలిమేరకు సీక్వెల్‌గా వచ్చిన పొలిమేర 2లో సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల తదితరులు నటించారు. ఓటీటీలో విడుదలైన మా ఊరి పొలిమేరకు కొనసాగింపుగా వచ్చిందీ సినిమా. మర్డర్ మిస్టరీకి బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని జత చేసి అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించారు.

కంగారూను కొట్టేశారు

- ఆసీస్‌పై భారత్ చారిత్రక టెస్టు విజయం
- వాంఖడేలో అమ్మాయిల అద్వితీయ ప్రదర్శన
- 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం
- 1-0తో టెస్టు సిరీస్ భారత్ వశం

ముంబయి : భారత మహిళల జట్టు అద్భుతం చేసింది. మహిళల క్రికెట్ అగ్రజట్టు, వరల్డ్ నం.1 ఆస్ట్రేలియా మెడలు వంచింది. టెస్టు క్రికెట్‌లో భారత్ చేతిలో ఓటమెరుగుని కంగారూలకు.. పరాజయం రుచి చూపించింది. ముంబయి వాంఖడే స్టేడియంలో జరిగిన ఏకైక టెస్టులో ఆస్ట్రేలియాపై భారత అమ్మాయిలు 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించారు. ఆస్ట్రేలియాపై తొలి టెస్టు విజయంతో సరికొత్త చరిత్ర సృష్టించారు. భారత స్పిన్నర్ల మాయతో ఆస్ట్రేలియా అమ్మాయిలు వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో 219, 261 పరుగులకే కుప్పకూలారు. దీప్తి శర్మ (78, 171 బంతుల్లో 9 ఫోర్లు), స్మృతీ మంధాన (74, 106 బంతుల్లో 12 ఫోర్లు), జెమీమా రొడ్రిగస్ (73, 121 బంతుల్లో 9 ఫోర్లు), రిచా ఘోష్ (52, 104 బంతుల్లో 7 ఫోర్లు) అర్థ సెంచరీలకు తోడు పూజ (47, 126 బంతుల్లో 7 ఫోర్లు), షెఫాలీ వర్మ (40, 59 బంతుల్లో 8 ఫోర్లు) రాణించటంతో టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 75 పురుగుల స్వల్ప లక్ష్యాన్ని మనోళ్లు 18.4 ఓవర్లలో అలవోకగా ఛేదించారు. స్మృతీ మంధాన (38 నాటౌట్, 61 బంతుల్లో 6 ఫోర్లు), రిచా ఘోష్ (13), జెమీమా రొడ్రిగస్ (12 నాటౌట్) రాణించారు. ఏడు వికెట్లతో కంగారూలను మాయ చేసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. 1-0తో టెస్టు సిరీస్ టీమ్ ఇండియా వశమైంది. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 400 పైచిలుకు పరుగులు చేసిన భారత అమ్మాయిలు.. తాజాగా ఆస్ట్రేలియాతో టెస్టు సమరంలోనూ అదే ప్రదర్శన పునరావృతం చేశారు. భారత్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్ మంగళవారం నుంచి మొదలు కానుంది.

ఆడుతూ పాడుతూ..

ఆస్ట్రేలియా అమ్మాయిలు నిర్దేశించిన 75 పరుగుల లక్ష్యాన్ని టీమ్ ఇండియా ఆడుతూ పాడుతూ ఛేదించింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ (4) త్వరగా నిష్క్రమించినా.. భారత్ ఎక్కడా తడబాటుకు గురి కాలేదు. స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన (38 నాటౌట్), రిచా ఘోష్ (13) జంట అర్ధ సెంచరీ భాగస్వామ్యంతో లాంఛనం మిగిల్చారు. మంధాన ఆరు ఫోర్లతో మెరువగా.. రిచా ఘోష్ సైతం మూడు బౌండరీలతో దండెత్తింది. ఘోష్ అవుటైనా.. జెమీమా రొడ్రిగస్ (12 నాటౌట్) సొంత మైదానంలో చారిత్రక విజయాన్ని అందించింది. 15 బంతుల్లో 2 ఫోర్లు బాదిన జెమీమా.. అజేయంగా 12 పరుగులు చేసింది. 18.4 ఓవర్లలోనే 75 పరుగుల మార్క్ అందుకున్న టీమ్ ఇండియా.. ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియాలపై అలవోక విజయం సాధించింది. కంగారూ బౌలర్లలో కిమ్ గార్త్, ఆష్లె గార్డ్‌నర్‌లు చెరో వికెట్ తీసుకున్నారు.

తోక కత్తిరించారు

మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా అమ్మాయిలు రెండో ఇన్నింగ్స్‌లో 233 పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్ లోటు పూడ్చటంతో పాటు లక్ష్య నిర్దేశనలోకి అడుగుపెట్టారు. చేతిలో మరో ఐదు వికెట్లు ఉన్నాయి. దీంతో కంగారూ అమ్మాయిలు చివరి రోజు ఆటలో ఏం చేస్తారా అనే ఉత్కంఠ కనిపించింది. ఆస్ట్రేలియా అమ్మాయిలు పోరాడేందుకు మనోళ్లు ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. ఓవర్‌నైట్ స్కోరుకు మరో 28 పరుగులే జోడించిన ఆస్ట్రేలియా.. చివరి ఐదు వికెట్లు కోల్పోయింది. దీంతో టీమ్ ఇండియా బ్యాటర్లకు శ్రమ లేకుండా పోయింది!. ఓవర్‌నైట్ బ్యాటర్లు అనాబెల్ సుథర్‌లాండ్ (27, 102 బంతుల్లో 3 ఫోర్లు), ఆష్లె గార్డ్‌నర్ (7, 27 బంతుల్లో 1 ఫోర్) ప్రతిఘటన నాల్గో రోజు ఉదయం ఒక్క పరుగైనా జోడించకుండానే ముగిసింది. పూజ ఓవర్లో గార్డ్‌నర్ నిష్క్రమించగా.. అనాబెల్‌ను స్నేహ్ రానా మాయలో పడేసింది. ఇక ఆ తర్వాత టెయిలెండర్లు పతకం లాంఛనమే అయ్యింది. జెస్ జొనాసెన్ (9), అలాన కింగ్ (0), కిమ్ గార్త్ (4) చేతులెత్తేశారు. 105.4 ఓవర్లలో 261 పరుగులకు ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ ముగిసింది. దీంతో భారత్ ముందు 75 పరుగుల లక్ష్యం నిలిచింది. భారత బౌలర్లలో స్పిన్నర్ స్నేహ్ రానా (4/63) నాలుగు వికెట్లతో మెరుగా.. మరో స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్ (2/42), హర్మన్‌ప్రీత్ కౌర్ (2/23), పూజ (1/40) రాణించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా మహిళల తొలి ఇన్నింగ్స్ : 219/10

భారత్ మహిళల తొలి ఇన్నింగ్స్ : 406/10

ఆస్ట్రేలియా మహిళల రెండో ఇన్నింగ్స్ : 261/10

భారత్ మహిళల రెండో ఇన్నింగ్స్ : షెఫాలీ వర్మ (సి) హీలే (బి) గార్త్ 4, స్మృతీ మంధాన నాటౌట్ 38, రిచా ఘోష్ (సి) మెక్‌గ్రాత్ (బి) గార్డ్‌నర్ 13, జెమీమా రొడ్రిగస్ నాటౌట్ 12, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (18.4 ఓవర్లలో 2 వికెట్లకు) 75.

వికెట్ల పతనం : 1-4, 2-55.

బౌలింగ్ : కిమ్ గార్త్ 5-1-19-1, ఆష్లె గార్డ్‌నర్ 9-2-18-1, తహ్లియా మెక్‌గ్రాత్ 2-0-14-0, జెస్ జొనాసెన్ 2.4-0-16-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68